ఫోకస్

# వ్యవసాయం



## తగ్గిన పత్తి ఎగుమతులు



పత్తి ఎగుమతులు 2023–24 సీజన్‌లో తగ్గాయి. 2022–23 ఆర్థిక సంవత్సరంలో 3 మిలియన్ బేల్స్ ఎగుమతికాగా, గత ఆర్థిక సంవత్సరం ఇది 2.8 మిలియన్ బేల్స్‌గా నమోదైంది. పత్తి ఎగుమతుల విలువ 2021– 22 ఆర్థిక సంవత్సరంలో 6.8 బిలియన్ డాలర్లుకాగా, 2021–22 ఆర్థిక సంవత్సరంలో 10.78 మిలియన్ డాలర్లకు చేరింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో 5.66 మిలియన్ డాలర్లకు తగ్గింది. 2023–24లో 6.78 మిలియన్ డాలర్లు. 2024–25 ఆర్థిక సంవత్సరానికిగాను ఇప్పటి వరకూ జరిగిన ఎగుమతుల విలువ 1.63 మిలియన్ డాలర్లు మాత్రమే. సుమారుగా మరో నాలుగున్నర నెలల సమయం ఉన్నందున, అప్పటిలోగా ఎగుమతులు పుంజుకుంటాయని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కాగా, అక్టోబర్ ఒకటో తేదీతో ప్రారంభమైన ప్రస్తుత సీజన్‌లో పత్తి ధర తగ్గింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బేల్ సగటు ధర రూ. 57,000గా ఉంది. గత ఏడాది ఇదే సమయానికి పత్తి బేల్ ధర 62,500 రూపాయలుగా ఉంది. కాగా, పత్తి ఎగుమతుల తగ్గుదలకు, మార్కెట్ రేట్ పతనానికి ఎన్నో అంశాలు కారణమవుతున్నాయి. అనుకూలంగాలేని వాతావరణ పరిస్థితుల నుంచి పత్తిపంటకు పడుతున్న తెగుళ్ల వరకూ ఎన్నో సమస్యలు ఎదురవుతున్నాయి. అదే విధంగా అమెరికా అధ్యక్ష ఎన్నికలు, రష్యా–ఉక్రేన్ యుద్ధం వంటి పలు అంశాలు మార్కెట్ ధరల్లో భారీ వ్యత్యాసానికి కారణమవుతున్నాయి.

## చదువుతో పనేముంది?



ఆలోచనతోపాటు ఆచరణ కూడా ఉంటే జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకోవడం కష్టమేమీ కాదని మధ్యప్రదేశ్‌లోని హర్దా జిల్లాకు చెందిన ప్రగతిశీల రైతు మధుసూదన్ థాకడ్ నిరూపిస్తున్నాడు. పదో తరగతితోనే చదువుకు స్వస్తిచెప్పాడు. 200 ఎకరాల్లో కూరగాయలు పండిస్తూ, ఏటా కోట్ల రూపాయలు సంపాదిస్తున్నాడు. అతని వినూత్న సాగు విధానాలు, ఆధునిక పద్ధతుల ద్వారా అందుకుంటున్న విజయాలు మిగతా రైతులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి. టమాటా, వెల్లుల్లి, మిరపకాయలు, క్యాప్సికం, అల్లం వంటి అధిక డిమాండ్ ఉన్న పంటలపై అతను దృష్టి పెట్టాడు. విజయం అనేది విద్యార్హతల ద్వారా లభించేది కాదని రుజువు చేస్తున్నాడు. సాంప్రదాయ వ్యవసాయం నుండి ఉద్యానవనానికి మారడం ద్వారా వేసిన సాహసోపేతమైన అడుగు అతని జీవితాన్ని పూర్తిగా మార్చివేసింది. రైతు కుటుంబంలో జన్మించిన థాకడ్‌కు బాల్యం నుంచి వ్యవసాయ విధానాలను దగ్గర నుంచి చూశాడు. తన తండ్రి సాంప్రదాయ వ్యవసాయాన్ని సాగిస్తూ, పడుతున్న కష్టాలను గమనించాడు. వ్యవసాయం పై లోతైన అవగాహన ఉన్నప్పటికీ, పూర్తికాల వృత్తిగా ఎంచుకోవడం అంత తేలికైన విషయం కాదు. దానివల్ల వచ్చే సవాళ్లు, కష్టాలు అతనికి బాగా తెలుసు. అయినప్పటికీ, భూమిపై ఉన్న మ క్కువ, కుటుంబ వారసత్వం, తనపై తనకు ఉన్న నమ్మకం థాకడేను వ్యవసాయం వైపు మొగ్గు చూపేలా చేసింది. అయితే, తండ్రి అనుసరిస్తున్న సాంప్రదాయ విధానాల వల్ల లాభం లేదని అర్థమైన అతను, సరికొత్త పద్ధతులను అనుసరించాలని నిర్ణయించుకున్నా డు. ఒక రకంగా ఇది సాహసోపేతమైన నిర్ణయమే. కానీ, వెనకడుగు వేయడానికి సిద్ధంగాలేని అతను లాభదాయమైన సాగు మొదలుపెట్టాడు. తన 200 ఎకరాల్లో 150 రకాలను హార్టికల్చర్‌కే కేటాయించి, అనేక రకాల పంటలు పండించడం మొదలు పెట్టాడు. మిరపకాయలు, క్యాప్సికమ టమాటా, వెల్లుల్లి, అల్లం అతని సాగులో ప్రధాన పంటలు. అతని ప్రయత్నం ఫలించింది. అధిక దిగుబడికి సరికొత్త సాగు విధానాలను అమలు చేస్తూ, వ్యవసాయ రంగంలో దూసుకెళుతున్నాడు. కోట్లకు పడగలెత్తిన థాకడ్‌ను నేడు ఎంతో మంది ఆదర్శంగా తీసుకొని, అతని మార్గంలోనే నడుస్తున్నాడు. కాలానికి అనుకూలంగా వ్యవసాయ విధానాల్లో మార్పులు చేస్తూ, ఆధునిక విధానాలను అమలు పరుస్తూ, సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ముందుకు సాగడమే థాకడ్ విజయ రహస్యం.

# పర్యావరణం



## పర్యావరణంపై అతిపెద్ద సదస్సు 'కాప్29'లో సాధించింది ఏమిటి?






ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో, పర్యావరణంపై జరిగే అతిపెద్ద సదస్సు 'కాప్29'. అజర్‌బైజాన్ రాజధాని బాకూలో ఈనెల 11న మొదలైన సదస్సు 22వ తేదీ వరకూ కొనసాగనుంది. రష్యా, ఇరాన్ దేశాల మధ్య ఉండే ఆసియా దేశమైన అజర్‌బైజాన్ ఈ మెగా సదస్సుకు ఆతిథ్యం ఇవ్వడం విశేషం. 'కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్'కు సంక్షిప్త రూపమే 'కాప్'. ఇప్పటి వరకూ 28 సదస్సులు జరిగాయి. ఇప్పుడు 29వ సదస్సు జరుగుతున్నది. కాబట్టి దీనిని 'కాప్29'గా వ్యవహరిస్తున్నారు. ఈ సమావేశానికి సాధారణంగా వివిధ దేశాల అధ్యక్షులు, ప్రధానమంత్రులు హాజరవుతారు. అయితే, కార్బన ఉద్గారాలు అత్యధికంగా ఉండే కొన్ని దేశాల అధినేతలు ఈ సంవత్సరం సమావేశానికి హాజరుకావడం లేదు. అమెరికా అధ్యక్షుడు జోబైడెన్, చైనా నేత జి జిన్‌పింగ్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మేక్రాన్ ఈ సమావేశానికి రాలేదు. పర్యావరణంపై యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డి లెయాన్ సైతం గైర్హాజరయ్యారు. ఆమె స్థనంలో కమిషనర్ వోప్కే హోక్‌స్ట్రా హాజరయ్యారు. ఐరోపా దేశాలకు ఈ సదస్సుపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉందో చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం ఏముంటుంది? 2015లో పారిస్ (ఫ్రాన్స్) వేదికగా జరిగిన సదస్సులో చేసిన తీర్మానాన్ని అనుసరించి, ఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ పెరగకుండా నిరోధించాలి. ఈ ఒప్పందానికి ప్రపంచ నాయకులు కట్టుబడి ఉండాలి. మరో రకంగా చెప్పాలంటే, అన్ని దేశాల అధినేతలు తమతమ దేశాల్లో విడుదలయ్యే కర్బన ఉద్గారాలను కట్టడి చేయాలి. ఈ ఒప్పందంలో భాగంగా 2025 నాటికి అభివృద్ధి చెందుతున్న దేశాల కోసం నగదు సహాయం లక్ష్యాలను కొత్తగా నిర్దేశించుకోవాలి. ఈ సాయాన్ని అభివృద్ధి చెందుతున్న దేశాలు కర్బన ఉద్గారాలు తగ్గించడానికి ఉపయోగిస్తాయి. అయితే, ఇప్పటి వరకూ జరిగిన సదస్సులేవీ అనుకున్న లక్ష్యాలను ఏమాత్రం అందుకోలేకపోయాయి. అందుకే, ఈసారి సదస్సుపైన కూడా అనుమానాలు పెరుగుతున్నాయి. 2030 నాటికి వాతావరణ పరిరక్షణకు ఆర్థిక సాయం మొత్తాన్ని ఏడాదికి ఒక ట్రిలియన్ డాలర్ల కంటే ఎక్కువగా ఉండేలా చూడాలని ఆఫ్రికన్ దేశాలు కోరుతున్నాయి. పేదరికంలో మగ్గుతున్న అనేక ఇతర దేశాల అభిప్రాయం కూడా ఇదే. చైనాతోపాటు కొన్ని గల్ఫ్ దేశాలను కూడా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో చేర్చారు. అందువల్ల ఈ సహకారం అందించడానికి ఈ దేశాలకు మినహాయింపు ఉంటుంది. అయితే, సహాయం మొత్తాన్ని పెంచడంతోపాటు, ఈ దేశాలను కూడా ఆర్థిక సాయంలో భాగస్వాములను చేసినప్పుడే ఏడాదికి ట్రిలియన్ డాలర్ల నిధి సాధ్యమవుతుందని యూరోపియన్ యూనియన్ వాదిస్తున్నది. ఎవరు, ఎంతెంత ఇవ్వాలన్నది ఇంకా తేలలేదు. ఒక స్పష్టమైన నిర్ణయానికి వచ్చే అవకాశం కనిపించడం లేదు. నిజానికి ధనిక దేశాలు అందచేయాల్సిన సాయంపై తీర్మానం సిద్ధమైంది. సౌదీ అరేబియా వేదికగా జరిగిన కాప్ 16లో 25 పేజీల డ్రాఫ్ట్‌ను రూపొందించగా, ఈసారి అది 10 పేజీలకు కుదించుకుపోయింది. ఎప్పటి మాదిరిగానే కీలకాంశాలు ఇందులోనూ కనిపించడం లేదు. అధిక దేశాలు, కర్బన ఉద్గారాలు ఎక్కువగా విడుదల చేస్తున్న దేశాలు చెల్లించాల్సిన మొత్తాలను ఏకరువు పెట్టడం, 1.3 ట్రిలియన్ డాలర్లను సేకరించాలని తాజాగా నిర్ణయించడం మినహా కొత్తదనం అంటూ ఏదీ లేదు. చెల్లింపులను ప్రస్తావించడం, లక్ష్యాలను నిర్దేశించడం తప్ప, చెల్లింపులు జరపకపోతే ఏం చేయాలన్న విషయాన్ని ఎక్కడా ప్రస్తావించలేదు. ఎప్పటి మాదిరిగానే సమావేశం మొదలైంది. శుక్రవారం ముగుస్తుంది. వాతావరణ కాలుష్యం... గ్లోబల్ వార్మింగ్ సమస్యలు అక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందమే.

### తలసరి కర్బన ఉద్గారాలు ఆసియాలోనే అధికం



ప్రపంచ వ్యాప్తంగా కర్బన ఉద్గారాలు ఆసియా ఖండంలోనే అధికం. గ్లోబల్ కార్బన్ బడ్జెట్ విడుదల చేసిన గణాంకాలను అనుసరించి, ఇటీవల కాలంలో కర్బన ఉద్గారాలు ప్రమాదకర స్థాయికి చేరుతున్నాయి. ఫలితంగా సాధారణ జీవనశైలి మారుతున్నది. సమాజంలోని అన్ని రంగాలపైనా పర్యావరణం తీవ్ర ప్రభావం చూపుతున్నది. సింగపూర్ అత్యధికంగా 27.7 శాతం ఉద్గారాలతో నంబర్ వన్ స్థానాన్ని ఆక్రమించింది. దీనితోపాటు ఆసియా ఖండానికే చెందిన ఖతార్ (26.7 శాతం), యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (25.8 శాతం), కువైట్ (24.5 శాతం), బ్రూనై (21.7 శాతం) కర్బన ఉద్గారాలతో వరుసగా రెండు నాలుగు ఐదు స్థానాల్లో ఉన్నాయి. మాల్టా (ఐరోపా) 19.4 శాతం, సౌదీ అరేబియా (ఆసియా) 17.3 శాతం, బెల్జియం (ఐరోపా) 17.2 శాతం, అమెరికా (ఉత్తర అమెరికా) 16.5 శాతం, ఒమన్ (ఆసియా) 15.4 శాతం కర్బన ఉద్గారాలతో ఆరు నుంచి పది స్థానాల్లో కొనసాగుతున్నాయి. ఈ జాబితాలో భారత్‌ది 91వ స్థానం. భారత్‌లో తలసరి ఉద్గారాలు 1.7 శాతంగా నమోదైంది.



## డిసెంబర్ 30న నల్లగొండలో సభ

### సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/కోదాడ:** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 సంవత్సరాలు అడిగిడుతున్న సందర్భంగా డిసెంబర్ 30న నల్లగొండలో జరుగు బహిరంగ సభను వందలాది సంఖ్యలో సిపిఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ దేశంలో 1925 డిసెంబర్ 36న ఉత్తరప్రదేశ్ కాన్పూర్‌లో స్థాపించబడి ఆనాటి నుండి కాన్పూర్ మీరట్ కేసులు ఎదుర్కొని భారత దేశ స్వాతంత్ర్యంలో కీలకపాత్ర వహించి ప్రాణ త్యాగాలు చేసిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని కొనియాడారు. అంతకు ముందు పార్టీ కార్యాలయంలో బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు, పట్టణ కార్యదర్శి ఎస్‌కె లతీఫ్, సీపీఐ సీనియర్ నాయకులు పైడిమర్రి వెంకటనారాయణ, డివిజన్ కార్యదర్శి ఉప్పతల శ్రీనివాస్, షేక్ మోసిన్, ఎఐవైఎఫ్ నాయకులు ఎస్‌కె జానీమియా, మీరా పాల్గొన్నారు.

## పెట్టుబడిదారీ వ్యవస్థకు కాలం చెల్లింది...

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు




**ప్రజాపక్షం/హసన్‌పర్తి :** పెట్టుబడిదారీ వ్యవస్థకు కాలం చెల్లిందని, కమ్యూనిజమే ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నదని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు అన్నారు. గురువారం హసన్ పర్తి మండల సిపిఐ సమితి సమావేశం నేదునూరి రాజమౌళి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగాతక్కళ్లపల్లి శ్రీనివాస రావు మాట్లాడుతూ ప్రపంచంలో పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయ సిద్ధాంతాన్ని కారల్ మార్క్స్ కనుగొన్నాడని ఆ సిద్ధాంతమే ప్రపంచంలో దోపిడీ నుండి మానవాళి విముక్తికి మార్గం చూపిందన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ రోజు రోజుకు సంక్షోభంలోకూరుకుపోతున్నదని, పెట్టుబడిదారీ వ్యవస్థ పతనంతో ప్రపంచ యువత ప్రత్యామ్నాయంగా ఎర్ర జెండా వైపు చూస్తున్నదని తెలిపారు. ఇప్పటికే క్యూబా, వియత్నం, చైనా తదితర దేశాలు కమ్యూనిస్టు దేశాలుగా ఉండి అభివృద్ధిలో దూసుకుపోతున్నాయని, ఇటీవల అమెరికాలో జరిగిన అధ్యక్ష ఎన్నికలలో పార్టీ ఆఫ్ సోషలిజం అండ్ లిబరేషన్ పార్టీ తరపున పోటీ చేసిన అభ్యర్థి క్లాడియ డీల క్రూజ్‌కు ఒక లక్షా ఏడు వేలఓట్లు లభించాయని తెలిపారు. అలాగే మన పొరుగు దేశాలైన నేపాల్‌లో, శ్రీలంకలో వామపక్ష ప్రభుత్వాలు ఏర్పడ్డాయని తెలిపారు. భారత కమ్యూనిస్టుపార్టీ ఆవిర్భవించి 100 సంవత్సరాలు డిసె ంబర్ 26కు పూర్తి చేసుకుంటున్నదన్నారు.జాతీయ ప్రజాతంత్ర విప్లవం లక్ష్యంగా, సోషలిజం ధ్యేయంగా, సామాజిక న్యాయం లౌకిక వాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో సిపిఐ కీలక పాత్ర పోషించిందన్నారు. స్వాతంత్ర పోరాటంలో సిపిఐ అనేక త్యాగాలు చేసిందని, ఎంతోమంది అమరవీరులను అందించిన చరిత్ర సిపిఐదన్నారు.హసన్ పర్తి ప్రాంతంలోఎర్రజెండానీడన పోరాడిన పాడి మల్లారెడ్డి, తోకల కొమురా రెడ్డి, పాడి చంద్రారెడ్డి, గంగిళ్ల లింగా రెడ్డి, రేణుకుంట్ల ఐలయ్య, నేదునూరి చెన్నయ్య లాంటి వీరులు అమరులై చిరస్థాయిగా నిలిచారన్నారు. ఎల్లాపూర్ సిపిఐ కార్యాలయానికి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు శంకుస్థాపన చేశారు. జిల్లా సిపిఐ కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, సీనియర్ నాయకులు మోతే లింగారెడ్డి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, గిరిజన రాష్ట్ర కార్యదర్శి మాలోత్ శంకర్, కాజీపేట మండల సిపిఐ కార్యదర్శి మునిగాల బిక్షపతి, బికేఎం యు జిల్లా కార్యదర్శి కర్రె లక్ష్మణ్, సిపిఐ హసన్‌పర్తి మండల కార్యదర్శి మెట్టు శ్యాంసుందర్ రెడ్డి, సహాయకార్యదర్శులుదోమరాకేష్, రేణిగుంట్ల రాజయ్య, రేణుకుంట్ల దుర్గా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## మతోన్మాద బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలి




**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** మతోన్మాద బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్ పరి వార్ శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం పిలుపునిచ్చారు. గురువారంగోదావరిఖని ప్రెస్ క్లబ్ లో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మతోన్మాద వ్యతిరేక సదస్సులో సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్రముఖ్య అతిథిగా మాట్లాడారు. బిజెపి అధికారంలోకి వచ్చిన 10సంవత్సరాల కాలంలో మతోన్మాదం పెచ్చురిల్లి పోతుందని, ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికొదిలి మతాల మధ్య కులాల మధ్య మారణ హోమన్ని సృష్టిస్తున్నదన్నారు. మతోన్మాదం గురించి వామపక్ష పార్టీలుగా ప్రజల్ని చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

## అక్రమ అరెస్టు..అప్రజాస్వామిక చర్య



**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్లప్రతినిధి:** అర్ధరాత్రి అక్రమంగా అరెస్ట్ చేయడం ముమ్మాటికీ అప్రజాస్వామిక చర్య అని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి అంగూరి రంజిత్ అన్నారు. బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా పర్యటనకి ఆయనను అరెస్టు చేయడాన్నీ ఖండించారు. ఆయన మాట్లాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాలను, ప్రజా పాలనా అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేయడం బాధాకరమన్నారు. బకాయిలు, ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం సరి కాదన్నారు. ప్రైవేట్ బడ్జెట్ కళాశాలల యాజమాన్యాలు కూడా సిబ్బందికి జీతాలు ఇవ్వలేక, భవన కిరాయిలు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులతో కష్టతరం అవుతుందన్నారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయి విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## ప్రజా శ్రేయస్సు కోసం పోరాడేది కమ్యూనిస్టు పార్టీ

### జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్



**ప్రజాపక్షం/ మధిర :** ప్రజలు ఎదుర్కొన సమస్యలు, బానిసత్వం నుండి విముక్తి కోసం పోరాటం చేసిన ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) అని ఆ పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ కొనియాడారు. గురువారం మధిర మండలం మల్లవరం గ్రామంలో సిపిఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు మందడపు వెంకయ్య, మంగమ్మ దంపతులకు ఆయన చేతుల మీదుగా సభ్యత్వాన్ని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ 1945వ సంవత్సరంలో ఆంధ్ర మహాసభ సంఘంలో సభ్యుడిగా చేరి ఆనాటి నుండి నేటి వరకు కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా దాదాపు 78 సంవతర్సాల పాటు సభ్యత్వం స్వీకరించిన వెంకయ్యలాంటి సీనియర్ కామ్రేడ్ తన చేతుల మీదుగా సభ్యత్వాన్ని అందించడం సంతోషించదగ్గ విషయమన్నారు. వెంకయ్య లాంటి కమిట్మెంట్ ఉన్న కామ్రేడ్స్ జీవితాన్ని ప్రస్తుత యువత అనుచరించాల్సిన అవసరం ఉందన్నారు. 1948 సంవత్సరంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం జరుగుతున్న సమయంలో మల్లవరం, జాలిముడి గ్రామాలు పోరాట వీరుల కేంద్రాలుగా మారిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. బానిసత్వం నుండి విముక్తి చేయటానికి, వెట్టిచాకిరిని తొలగించడానికి ఈ దేశంలో పోరాటం నడిపించిన ఏకైక పార్టీ సిపిఐ అని కొనియాడారు. యువత సిపిఐ చరిత్ర తెలుసుకుని ఆపార్టీలో సభ్యులుగా చేరడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సిపిఐజిల్లా కార్యవర్గ సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, రామాంజనేయులు, మందడపు రాణి, జిల్లా సమితి సభ్యులు ఏనుగు గాంధీ, మడుపల్లి లక్ష్మ ణ్, మల్లవరం గ్రామ శాఖ నాయకులు మందడపు నాగకృష్ణ, మచ్చ, పద్మ, మందడపు పుల్లయ్య,, మందడపు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## అరచేతిలో వైకుంఠం చూపిస్తున్న ప్రభుత్వం

### భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు సృజన




**ప్రజాపక్షం/నర్సాపూర్:** నర్సాపూర్ సిపిఐ పార్టీ కార్యాలయంలో సమాఖ్య 22వ మహాసభలనునిర్వహించారు. మహిళలపై దాడులు ఎక్కువైతున్న నేపథ్యంలో ఎక్కడ అఘాయిత్యాలు జరిగితే మహిళలకు గత,ప్రస్తుత ప్రభుత్వం ఉచిత హామీలతో మహిళలను మోసం చేశారని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాలలో కూడా ఉద్యమించే సత్తా ఉన్నదన్నారు. మహిళా సమైక్యాలలో సభ్యత్వం తీసుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా పింఛన్లు పెంచలేదని, వికలాంగులకు కూడా పెంచలేదన్నారు. హామీలపై నిలదీయవలసిన అవసరం ఉందన్నారు. వీటన్నింటిని నిలదీయడానికి మహిళా సమైక్యలో ఒక నాయకురాలు ఉండాలన్నారు.గ్రామ గ్రామాన కమిటీలు వేసి ధర్నాలు చేయాలని ఆమె పిలుపునిచ్చారు. మహిళా సమైక్య ద్వారా ఎన్నో పోరాటాలు చేసిన ఫలితంగా ఇప్పుడున్న మహిళలకు కొన్ని పథకాలు అమలు చేసుకున్నామన్నారు.మహిళలందరూ భారత జాతీయ మహిళా సమైక్యలో సభ్యులుగా చేరాలని అన్నారు. ఈనెల 23న హైదరాబాద్ బషీర్బాగులో మహిళా సమైక్య సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళా సమైక్య రాష్ట్ర సహాయ రాష్ట్ర సహాయ కార్యదర్శి పై మీద బేగం, జిల్లా నాయకురాలు విజయలక్ష్మి, సిపిఐ మెదక్ జిల్లా కార్యదర్శి ఖాలేక్, సిపిఐ నాయకులు నాగరాజు, సాయిలుపాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు దోబూచులాట

### ఎస్ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి ఏపూరి లతాదేవి



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోబూచులాడుతున్నాయని అఖిల భారత మహిళా సమాఖ్య ఎస్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి ఏపూరి లతాదేవి విమర్శించారు. గురువారం వేంసూరుమండల తహాశీల్దార్ కార్యాలయం ముందు సాదు రామలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో లతాదేవి ముఖ్య అతిధిగా మాట్లాడారు. రాష్ట్రంలో లక్షలాది మంది ఒంటరి, వితంతు మహిళలు అనేక సమస్యలతో బాదపడుతున్నారని, వారి సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐడబ్ల్యూ ఆద్వర్యంలో జరిగే పోరాటాలకు సిద్దంకావాలని పిలుపునిచ్చారు. మోడి ప్రభుత్వం అధికారంలోకి రెండవ సారి వచ్చిన అనంతరం ప్రజల సమస్యలు మరింత పెరిగాయన్నారు. నిత్యావసరాల ధరలు కొండెక్కాయని, పేదలు ఏమి కొన,తిన లేని స్థితిలో ఉన్నారని మండిపడ్డారు. ప్రదాని మోడి తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాటి నిర్మల, శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కో కన్వీనర్ సిహెచ్ సీతామహాలక్ష్మి మాట్లాడుతూదేశం,రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైందన్నారు. ప్రతి మండలంలో ఒక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, ప్రతి గ్రామానికి మహిళా పోలీస్‌ను నియమించాలని, గ్రామాలలో యద్దేశ్చగా నడుస్తున్న బెల్ట్ షాపులను మూసివేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం బికెఎంయూఖమ్మంజిల్లా వర్కిం గ్ ప్రెసిడెంట్ దందు ఆదినారాయణ, మహిళా సమైఖ్య ఎస్ఎఫ్ఐడబ్ల్యూ సత్తుపల్లి డివిజన్ కన్వీనర్ ఎస్‌కే రంజాన్, బి రామలక్ష్మి, సూరమ్మ, సత్యవతి, వెంకటమ్మ, అంజమ్మ, సుజాత, నాగలక్ష్మి, సీతమ్మ, భాగ్యమ్మ, సరోజిని, కుమారి తదితరులు పాల్గొన్నారు.

**ఒంటరి, వితంతు మహిళల కమిటీ ఎన్నిక**

అధ్యక్షులుగా సాదు సూరమ్మ, కార్యదర్శిగా కనపర్తి సుజాత,ఉపాధ్యక్షురాలిగా నాగలక్ష్మి, సహాయ కార్యదర్శిగా కళ్యాణి ,మల్లు నాగలక్ష్మి మరో 15 మందితోఎన్నుకున్నారు.

# కొనుగోలు కేంద్రాలలో సౌకర్యాల లేమి

* ధాన్యం ఆరబోతకు రోడ్లే దిక్కు!
* పేరుకే కొనుగోలు కేంద్రాలు
* సౌకర్యాలు లేక తప్పని తిప్పలు



**ప్రజాపక్షం/హాలియా :** ఆరుగాలం శ్రమించి కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు రైతులు పడుతున్న పాట్లు అన్ని ఇన్ని కావు. రైతులకు మద్దతు ధరకల్పించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో సరైన సౌకర్యాలు లేక రైతులు ధాన్యం ఆరబోతకు రోడ్లపైకి వెళ్లారు. దీనివలన జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరగడంతో రోడ్లపై ఉన్న ధాన్యాన్ని తప్పించే ప్రయత్నంలో బాటసారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఇబ్రహీంపేట వద్ద ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద కనీస సౌకర్యాలు లేక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. కోసిన దాన్యంలో తేమశాతం అధికంగా ఉండడంతో ఆ ధాన్యాన్ని ఆరబోసుకునేందుకు ఆ కొనుగోలు కేంద్రంలో స్థలం లేక రైతులు జాతీయ రహదారిపై ధాన్యాన్ని ఆరబోసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.వాహనదారులకు తీవ్ర ఇబ్బందిగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయి. గతవారం ఈప్రాంతానికి వచ్చిన జిల్లా కలెక్టర్ ఇలాంటి కొనుగోలు కేంద్రాలలో రైతు లు ధాన్యాన్ని ఎలా అమ్ముకుంటారు ఇక్కడ సౌకర్యాలు ఎక్కడ కల్పించారు అంటూ సంబంధిత అధికారులను ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద చేపట్టాల్సిన కనీస సౌకర్యాలకు నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ అధికారులు అవేవీ కల్పించగా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ధాన్యంలో ఉన్న తేమ శాతాన్ని పరీక్షించే యంత్రాలు కూడా ఈ కేంద్రంలో సక్రమంగా పనిచేయక రైతులు దాన్ని అరబోతలో నానా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. వారం రోజులు ధాన్యాన్ని ఆరబోసిన తేమశాతం రాకపోవడంపై రైతులు సంబంధిత అధికారులతో వాగ్వాదానికి దిగుతున్నారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి దాన్యంలో ఉన్న తేమను కొలిచే యంత్రాలను సరిచేసి ఈ కేంద్రాలకు పంపించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# నల్లగొండ డిఇఒ భిక్షపతి లీలలు

**భార్య ఉండగానే మరో మహిళతో వివాహేతర సంబంధం**

**తులసివనంలో గంజాయి మొక్క!**

**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి :** జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి భార్య ఉండగానే మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్న ఘటన పట్టణ పరిధిలో చోటు చేసుకుంది. జిల్లా పరిధిలో ప్రియురాలితో ఉండగా మొదటి భార్య మాధవి నల్లగొండలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కొంతకాలంగా భార్య భర్తల విడాకుల కేసుకోర్టులో నడుస్తున్న మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుం డానే ప్రియురాలిని పెళ్లి చేసుకోవడంపై మాదవి ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతకాలంగా వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా వ్యవహరిస్తున్న డిఈఓ భిక్ష పతిమహిళా ఉపాధ్యాయులపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. తనకు లొంగకుంటే వేధింపులకు గురిచేసి సస్పెండ్ చేస్తారనేది భిక్షపతిపై గతంలో పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయడం జరిగిందని పలువురు ఆరోపిస్తున్నారు. రాజకీయ పలుకుబడితో నల్లగొండడలో ఏళ్లుగా తిష్టవేసిన భిక్షపతి వ్యవహారంపై మహిళా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

## ప్రభుత్వాసుపత్రి ఆకస్మికంగా తనిఖీ



**ప్రజాపక్షం/మునగాల:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సూర్యాపేట జిల్లా డిఎంహెచ్‌వో కోటా చలం గురు వారం అకస్మికంగా తనిఖీ చేశారు. శిధిలావస్థలో ఉన్న ఆర్‌ఎంపి భవనాన్ని కూల్చి నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని ప్రారంభించాలని పలు పత్రిక కథనాలలో రావడంతో స్పందించిన ఆయన మునగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసినట్లు తెలిపారు. అర్‌అండ్‌బి ఎఇ, ఇంజనీర్‌తో మాట్లాడి వెంటనే భవనాన్ని కూల్చివేయాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించడానికి అనుమతి కోరుతూ కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్ర మంలో మునగాల తహసిల్దార్ ఆంజనేయులు, ఎంపిడివో రమేష్‌దీన్‌దయాల్, ప్రాథమిక వైద్యాధికారి, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముగింపు దశకు సమగ్ర సర్వే

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర కుటుంబ సర్వే పట్టణంలో ముగింపు దశకు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ బి శ్రీనివాసు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో ఎన్యూమరేటర్ల వద్ద వివరాలు నమోదు చేసుకొని వారు వార్డు అధికారికి వివరాలను తెలపాలని, లేదా మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ కౌంటర్‌లో సంప్రదించాలని తెలిపారు. నేడు(శుక్రవారం) నుండిడేటాఎంట్రీ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 93913 26248ను సంప్రదించాలని కోరారు.

## సైన్స్‌పై అభిరుచి పెంపొందించుకోవాలి




**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** విద్యార్థులు సైన్స్ పట్ల అభిరుచిని పెంపొందించుకోవాలని మండల నోడల్ అధికార బీరెల్లి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముఖి ప్రతిభా పోటీలు జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు సైదులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూఢనమ్మకాలకు విద్యార్థులు, ప్రజలు దూరంగా ఉండాలని, నిరూపితమైన జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను మెమోఎటోలు, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నలబోలు శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సృజనాత్మకతతోనే విజ్ఞానాభివృద్ధి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** సృజనాత్మకతతోనే విజ్ఞానాభివృద్ధి సాధ్యమవుతుందని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు గొల్లమూడు రమేష్ బాబు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని శ్రీగ్రాండ్ బంకెట్‌హాల్‌లో నిర్వహించిన మండల స్థాయి చెకుముఖి పోటీలు నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలకకు చెందిన 150 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించిన విద్యార్థులకు జ్యోతి హాస్పిటల్ డాక్టర్ సునీల్ కుమార్, చందన గ్రూప్ విద్యాసంస్థలు, ఆభరణా జ్యూవెలర్స్ సౌజన్యంతో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో సుధాకర్ పివిసి ఇండస్ట్రిస్ అధినేత మీలా మహాదేవ్, చందన గ్రూఫ్ విద్యాసంస్థల అడ్మినిస్టేషన్ అధికారి గుండా రమేష్, ఉత్తమ ఉపాధ్యాయులు వి దయానంద్, సత్యనారాయణరెడ్డి, వనమాల వెంకటేశ్వర్లు, తల్లాడ రామచంద్రయ్య, జాఫర్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి డిపో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** ఆర్టీసీ డిపో కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు యాజమాన్యం చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం రాంబాబు, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రీజియన్ కార్యదర్శి బత్తుల సుధాకర్‌లు అన్నారు. గురువారం ఆర్టీసి డిపో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తాటికల్ రూట్‌లో డీలక్స్ సర్వీసులను ఓటి సర్వీసులుగా నడపడంతో డ్రైవర్లు చాలా ఇబ్బందులు పడుతున్నారని వాటిని స్పెషల్ ఆఫ్ డ్యూటీలుగా నడపాలని డిమాండ్ చేశారు. అన్ని సర్వీసులకు ప్రతి ట్రిప్పులో రెస్టు టైం ఎక్కువగా ఇవ్వడంతో ప్రతి రోజు 14 గంటల పాటు ఓటు డ్యూటి చేయడం ఇబ్బందిగా ఉందన్నారు. డిపోలో వాటర్ ప్లాంట్ మరమ్మతుకు రావడంతో తాగునీరు లేక ఇబ్బందులు ఉన్నట్లు తెలిపారు. వెంటనే దానిని మరమ్మత్తు చేసి శుద్ధజలాలను అందించాలన్నారు. మానవీయకోణంలో కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపో కార్యదర్శి ఉప్పు లక్ష్మ య్య, సురేష్, కార్మికులు ఉన్నారు.

## సమయపాలన పాటించని టీచర్లు

**షోకాజ్ నోటీసు జారీ చేసిన ఎంఇఒ రాములు దయాల్**



**ప్రజాపక్షం/ అయిజ :** మండల పరిధిలోని తపత్రాల గ్రామంలో ఉపాధ్యాయులు ప్రేయర్ సమయానికి రాక పోవడంతో విద్యార్థులే ప్రేయర్ చేస్తున్నారని గ్రామస్తులు యువకులు విద్యార్థులు ప్రేయర్ చేస్తున్న దృశ్యాన్ని వీడియో తీసి నెట్టింట వైరల్ చేశారు. దీంతో ప్రతి గ్రూపులో ఇదేం విచిత్రం అంటూ, ఎంఈఓ,డిఈఓలు ఏం చేస్తున్నట్లుఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదంతా ఎంఈఓ దృష్టికి రావడంతో ఉపాధ్యాయులకు బాబురావు ద్వారా ఎంఇఒ రాములు దయాల్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ విషయమై గ్రామస్తులను ప్రశ్నించగా ఎన్నో మార్లు ఉపాధ్యాయులు టీచర్లు పాఠశాలకు రావడం లేదని, గత ఎంఇఒ నర్సింహులుకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని తెలిపారు. ఇప్పటికైన పాఠశాలకు సమయానికి వచ్చి విద్యార్థుకు సరియైన బోధన చేసి విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చాలని అన్నారు.

# అంకిత భావంతో విధుల నిర్వహణ

**ప్రజలకు పోలీస్‌లు ప్రాణవాయువులా పనిచేయాలి**

**పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలి : రాచకొండ సిపి సుధీర్ బాబు**



**ప్రజాపక్షం /నల్లగొండ :** పోలీస్ శాఖలో అంకిత భావంతో, క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ, తెలంగాణ రాష్ట్ర పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని రాచకొండ సిపి సుధీర్ బాబు అన్నారు.నల్లగొండ జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో తొమ్మిది నెలల బేసిక్ ఇండెక్షన్ ట్రైనింగ్ సంగారెడ్డి,వికారాబాద్,కామారెడ్డి,నారాయణపేట,నిర్మల్ జిల్లాలకు చెందిన 265 మంది ఏ.ఆర్ ట్రైనీ కానిస్టేబుళ్ళ పాసింగ్ అవుట్ పరేడ్‌కి ముఖ్యతిదిగా సిపి సుధీర్ బాబు ,సూర్యాపేట జిల్లా ఎస్‌పి సన్ ప్రీత్ సింగ్,నల్లగొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ లు హాజరైనారు. సిపి మాట్లాడుతూ 9 నెలలు ఎంతో క్రమశిక్షణతో శిక్షణ పూర్తి చేసుకున్న ట్రైని కానిస్టేబుల్‌కు అభినందనలు తెలియజేస్తూ ఇక్కడ మంచి ఆక్సిజన్ పొందుతూ శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఇకనుంచి నూతన ఉత్సాహంతో ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందిస్తూ ప్రాణవాయువు లాగా పనిచేయాలన్నారు. పోలీసు శాఖలో ఉద్యోగం అంటేనే ఎన్నో సవాళ్ళతో కూడుకున్న ఉద్యోగం అని, శారీకంగా, మానసికంగా దృఢంగాఉన్నపుడే ఎలాంటి సవాల్లనైనా ఎదుర్కొనగలం అన్నారు. ఈ ట్రైనింగ్ అనంతరం కూడా రోజు వ్యాయామం చేసి ఫిట్ గా ఉండాలన్నారు. అనంతరం శిక్షణా కాలంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బెస్ట్ అల్ రౌండర్ జె.అనిల్,బెస్ట్ ఇండోర్ ఆర్.మహేష్,బెస్ట్ ఔట్ డోర్ ముజిబుద్దిన్,బెస్ట్ ఫైరర్ టీ. ప్రశాంత్, పరేడ్ కమండర్ నరేష్ గార్లకు అవార్డులు అందజేశారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి డిటిసి రమేష్,అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ రాములు నాయక్, డిటిసి డిఎస్‌పి విఠల్ రెడ్డి,నల్లగొండ డిఎస్‌పి శివ రాం రెడ్డి,ఏఆర్ డిఎస్‌పి శ్రీనివాస్,సిఐలు దానియల్ రాజశేఖర్ రెడ్డి,రాజు ఆర్.ఐలు హరి బాబు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దేవరకొండలో 26న 'సిపిఐ కవాతు'



**ప్రజాపక్షం/దేవరకొండ :** డిసెంబర్ 26న సిపిఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దేవరకొండలో నిర్వహించే కవాతుకు శ్రేణులు తరలిరావాలని సిపిఐ డిండి మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకాచారి అన్నారు. గురువారం డిండి మండలంలోని కామేపల్లి గ్రామంలో నిర్వహించిన సిపిఐ గ్రామ శాఖ సమావేశానికి లక్ష్మయ్య అధ్యక్షత వహించగా ముఖ్య అతిధిగా హాజరైన కనకాచారి మాట్లాడుతూ 26 డిసెంబర్ 1925న ఏర్పడిన సిపిఐ నాటి నుండి నేటి వరకు పేద ప్రజల పక్షాన పోరాడుతున్న ఏకైక పార్టీ సిపిఐ అని, దేవరకొండలో డిసెంబర్ 26న సిపిఐ 100 సంవత్సరాల విజయోత్సవ సంబరాల్లో భాగంగా భారీ కవాతు ఏర్పాటు చేస్తున్నందున పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సభ్యులకు నూతన సభ్యత్వం అందజేశారు. ప్రజ లు రేషన్ కార్డులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని త్వరగా అర్హులందరికి నూతన రేషన్ కా ర్డులు అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈకార్యక్రమంలో సిపిఐ డిండి మండల సహాయ కార్యదర్శి బొల్లే శైలేష్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు, శాఖ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## గుడ్‌లైఫ్ సాయంతో ఉచిత వైద్య శిబిరం



**ప్రజాపక్షం/అయిజ** మున్సిపాలిటీ కేంద్రంలో గుడ్‌లైఫ్ వారి సహకారంతో చైతన్య రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో ఉతచి వైద్య శిబిరాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుడ్‌లైఫ్ మినిస్ట్రీస్ వ్యవస్థపకులు శ్యాం గుంటి హాజరై ఉచిత వైద్య శిభిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా మారుమూల గ్రామాల్లో, పేదలకోసం ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేశామని తెలిపారు. డాక్టర్లు రాజేశ్వరి గైనకాలజిస్టు, శ్వేత జనరల్ ఫిజిషియన్, కంటి డాక్టర్లు అంజిరెడ్డి, పవన్, ఆర్గ నైజర్ లూక్ జాన్సన్, సభ్యులు యుగంధర్, తదతరులు పాల్గొన్నారు.

# డేటా నమోదులో ఎలాంటి తప్పులు ఉండొద్దు



**ప్రజాపక్షం/యాదాద్రి :** సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీ ఆపరేటర్లు డేటా నమోదులో ఎలాంటి తప్పులు లేకుండా బాధ్యతాయుతంగా నిబద్ధతతో పనిచేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన, ఎన్యుమరేటర్లు, డేటాఎంట్రీ ఆపరేటర్ల శిక్షణ కార్యక్రమంలో డేటా ఏంట్రీ ఆపరేటర్లకు దిశ నిర్దేశం చేశారు. ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డేటా ఎంట్రీ ఆపరేటర్లకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లడుతూ డేటా ఎంట్రీ నమోదు విధివిధానాలపై వివరించారు. సమగ్ర కుటుంబ సర్వే వివరాలు గోప్యంగా ఉంచాలన్నారు. దరఖాస్తు ఫామ్‌లను జాగ్రత్తగా ట్రంక్ పెట్టెలో భద్రపరచాలన్నారు. జిల్లాలో చౌటుప్పల్ రెవిన్యూ డివిజనల్ పరిధిలోగల 5 మండలాలకు 500 మంది డేటా ఏంట్రీ ఆపరేటర్లకు ఉదయం శిక్షణ ఇచ్చారు. భువనగిరి రెవిన్యూ డివిజన్ పరిధిలోగల 12 మండలాలకు 800 మంది డేటా ఆపరేటర్లకు సాయంత్రం శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. సమగ్ర కుటుంబ సర్వేలో సేకరించిన సమాచారాన్ని డేటాఆపరేటర్లు నిబద్ధతతో బాధ్యతాయుతంగా తప్పులు లేకుండా పారదర్శకంగా ఎంట్రీ చేయాలన్నారు. డేటాఎంట్రీ ఆపరేటర్లకు న మోదు చేసిన ఫారంల ద్వారా శిక్షణలో క్షుణ్ణంగా అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ శిక్షణలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, జిల్లా పరిషత్ కార్యనిర్వహణాధికారి శోభారాణి, జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి శామ్యూల్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంగవైకల్యం ఎవరికీ అడ్డు కాదు



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** అంగవైకల్యం అనేది ఎవరికి అడ్డు కాదని ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి వైకల్యం అడ్డు రాదని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మహిళా శిశు వికలాంగుల,వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని జిల్లా స్థాయి క్రీడా పోటీలను స్థానిక మేకల అభినవ స్టేడియం నందు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సువాస్ సెల్వాయి జీవితం వికలాం గులకు ఆదర్శమని అతడు టోక్యోలో జరిగిన పారా ఒలంపిక్స్ లో రెండుసార్లు మెడల్ సాధించి దేశానికి వన్నె తెచ్చారని కలెక్టర్ అన్నారు.రేపు జూనియర్ సీనియర్ దివ్యాంగులకు ఆటల పోటీలను నిర్వహిస్తూ జిల్లా స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులను ఈ నెల 25 నవంబర్ నుండి జరిగే రాష్ట్రస్థాయిలో దివ్యా ంగుల ఆటల పోటీలకు పంపించడం జరుగుతుందని పేర్కొన్నారు.దివ్యాంగ క్రీడా పోటీలలో సోదర సోదరీమణులు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని ఇందులో దివ్యాంగులు ప్రభుత్వ శాఖలు,స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు భాగస్వామ్యంతో నిర్వహించాలని అన్నారు. జిల్లా సంక్షేమ అధికారిని కె.వి.కృష్ణవేణి,జిల్లా యువజన క్రీడ అధికారి విష్ణుమూర్తి,స్కూల్ గేమ్ ఫడరేషన్ విమల ,సిడిపిఓలు నిర్మల, లావణ్య కుమారి,హరిత ఫిజికల్ డైరెక్టర్స్ సఖీ స్టాఫ్ సునీత, నాగమణి,సిబ్బంది గణేష్,వెంకట్ రెడ్డి నాగిరెడ్డి పాల్గొన్నారు.

# రిజర్వేషన్ల దోపిడీకి అడ్డుకట్ట వేయాలి



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** ఈడబ్ల్యూఎస్ పేరుతో జరుగుతున్న రిజర్వేషన్ల దోపిడిపై ప్రతిఘటించి అడ్డుకోవాలని బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థుల అవకాశాలను ఈడబ్ల్యూఎస్ కోట కొల్లగొడుతుందని జనాభా ప్రతాతిపదికన అందాల్సిన రిజర్వేషన్లు నాలుగు శాతం కూడా లేని అగ్రవర్ణాలు 10శాతం రిజర్వేషన్లు అనుభవిస్తున్నారన్నారు. మెరిట్ మార్కులు సాధించిన బిసి, ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులు ఓపెన్ కేటగిరి పోస్టులు పొందే జీవో 55ను రద్దు చేయాలన్నారు. మెరిట్ మార్కులు పొందిన కూడా కేవలం రిజర్వేషన్ కేటగిరి పోస్టులలో మాత్రమే భర్తిచేసి జీవో 29ను అమలు చేయాలన్నారు. గ్రూఫ్ 4 ఉద్యోగాల్లో ఈడబ్ల్యూఎస్ 365 ర్యాంకు వచ్చిన వారికి ఉద్యోగం రాలేదని అందువల్ల మేధావులు, విద్యార్థి, ప్రజా సంఘాల ఇప్పటికైన రిజర్వేషన్ల దోపిడిని అడ్డుకట్ట వేసేసేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సంఘం జిల్లా అధ్యక్షులుదంతాల రాంబాబు, పట్టణ సిపిఐ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, గాలి రామకృష్ణ పాల్గొన్నారు.

# మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యం



**ప్రజాపక్షం/యాదాద్రి :** మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి అన్ని రంగాలలో ముందుకు తీసుకొని వెళ్లడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్ ఆవరణలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇందిరామ హిళా శక్తి క్యాంటీన్‌ను భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హనుమంత రావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్‌తో కలిసి క్యాంటీన్ ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు చేసే ప్రతి కార్యక్రమం ప్రభుత్వం ద్వారానే ముందుకెళ్తుందని, బ్యాంకు రుణాలు పూర్తి స్థాయిలో నూటికి నూరు శాతం అప్పు తిరిగి చెల్లిస్తూ ఆర్థికంగా మహిళలు ఎదుగుతున్నారన్నారు. పొదుపు చేసుకొని పొదుపు ద్వారా లోన్ తీసుకొని వృత్తిలోకి ముందుకు రావడం చాలా గొప్ప విషయమని అన్నారు. మహిళలు తీసు కున్న రుణాన్ని ఆలస్యం చేయకుండా చెల్లిస్తున్నారు. కాబట్టి మహిళలకు బ్యాంకులు రుణాలు ఇస్తుందని వారిని ప్రోత్సహిస్తుందన్నారు. జిల్లాలో 5 మహిళా శక్తి క్యాంటీన్‌లు వచ్చాయన్నారు. ప్రజాపాలన లో భాగంగా మహిళలకు చేయూత నిచ్చే విధంగా పావలా వడ్డీ రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. జిల్లాలో స్త్రీ శక్తి మహిళా భవన్ కేటాయించడం జరిగిందని దానికి కావాల్సిన భూమిని కూడా ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలను అన్ని విధాలుగా ఆర్థికంగా స్వయం సమృద్ధి చేస్తుందని, ప్రభుత్వం ఏ కార్యక్రమం మొదలు పెట్టిన మహిళల సంక్షేమ పథకాల ద్వారానే మొదలు పెట్టడం జరుగుతుందన్నారు.ఫుడ్ సేఫ్టీ అథారిటీ ద్వారా ట్రైనింగ్ పొందిన మహిళా ద్వారా మహి ళా శక్తి క్యాంటీన్ పెట్టడం ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, జిల్లా ముఖ్య కార్య నిర్వాహక అధికారి శోభారాణి, గ్రంధాలయ చైర్మన్ అవేజ్ చిస్తి, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, ఆర్డిఓ కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామానుజా రెడ్డి, డిపియమ్, ఏపియమ్‌లు, మహిళా శక్తి సంఘం అధ్యక్షురాలు రేణుక, స్వయం సహాయక సంఘాలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పత్తి రైతులకు ఇబ్బందులు

**ప్రజాపక్షం/ఉండవెల్లి :** అరుకాలం కష్టించి పండించిన పంటను అమ్ముకునేందుకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఒకపక్క ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటను కాపాడుకునేందుకు రైతు ఇబ్బందులు ఎదుర్కొంటూ పండించిన పంటను అమ్ముకునేందుకు కూడా సమస్యగా ఏర్పడింది. మండలంలోని 16 గ్రామపంచాయితీలో సుమారు రెండు వేల 973 మంది రైతులు ఏడు వేల 63 ఏకరాల్లో విస్తీర్ణం పత్తి సాగు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి అనిత తెలిపారు. ఎకరానికి కింటాలుకు పది నుండి 8 క్వింటాళ్లు పత్తి దిగుబడి వచ్చేట్లు వారు వెల్లడించారు. కేంద్రా రాష్ట్ర ప్రభుత్వాలు గిట్టుబాటు ధర కోసం ఉండవెల్లి పరిధిలోని వరసిద్ధి కాటన్ మిల్లులో సీసీఐ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రాత్రి పగలు అమ్ముకోవడానికి రైతులు అవస్థలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. అనుమతుల కోసం నిరీక్షణ కోసం వేచి ఉండలేక బయట ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకుని కింటాలు మీద 1500 వరకు నష్టాన్ని కి అమ్ముకుంటున్నట్లు రైతులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని సీసీఐ కేంద్రాల వద్ద కొనుగోలు చర్య వేగవంతం చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పత్తి రైతులు డిమాండు చేస్తున్నారు. నిబంధనలు తొలగించి నేరుగా రైతు నుంచి కొనుగోలు చేయాలని వారు కోరారు.

## జల్లాపురం పశువైద్యశాలలో డాక్టర్ ఎక్కడా?

**ప్రజాపక్షం/మానవపాడు:**జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం జల్లాపురం గ్రామంలో ఉన్న ప్రాథమిక పశువైద్య కేంద్రం ఉంది. ఈ కేంద్రానికి నాలుగు గ్రామ పంచాయితీలు జల్లాపురం బోరవెల్లి పల్లెపాడు చందూరు ఈ గ్రామాలలో ఉండే రైతులు ఎక్కువగా పశుపోషణ ఉన్న గొర్రెల మందలు ఆవులు, గేదెలు , ఎద్దులు, మేకలు ఇక్కడ పోషణ జరుగుతుంది. పశువులకు ఆరోగ్యం బాగోలేదని ఈ గ్రామంలో పశువుల డాక్టర్‌ను కలవడానికి వస్తే 3సంవత్సరాల నుండి డాక్టర్లు ఉండటం లేదని పశుపోషణ రైతులు ఆవేదన చెందారు. చేసేది ఏమీ లేక ఆఫీసులో ఉన్న క్లినిక్ అనే మహిళ భారతితో మాట్లాడి తమ మేకలకు ట్రీట్మెంట్ తీసుకున్నారు.భారతిని అడుగగా ఇంకా డాక్టర్‌ను నియమించలేదని, నాకు తెలిసిన చిన్న చి న్న రోగాల జంతువులకు నేనే ట్రీట్మెంట్ చే స్తున్నానని, ఏదైనా ఎమర్జెన్సీ ఉన్న జంతువులకు మాత్రం మాపై ఉన్న అధికారులకు సమాచారం మేరకు ట్రీట్మెంట్ చేస్తున్నానన్నారు.ఈ కేంద్రానికి మిషన్ భగీరథ వాటర్ పైపు లైన్, మూత్రశాల నిర్మాణం సౌకర్యాలు కల్పించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న కరెంటు సప్లయి లేదు ఆఫీస్ వెనుక భాగం మొత్తం గడ్డి పెరిగిపోయిందని, ఈ ఆఫీస్‌కు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని బోరవెల్లి , జల్లాపురం గ్రామ రైతులు పశువైద్యశాల అటెండర్ భారతి తెలిపారు.

# మహిళలు ఆర్థికంగా ఎదగాలి

* మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యేలు
* జిల్లాలోనే మొదటి క్యాంటీన్



**ప్రజాపక్షం/హాలియా:** మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే ఆ సమాజం అభివృద్ధిని సాధిస్తుందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి లు అన్నారు. గురువారం హాలియా మున్సిపాలిటీలో ఏర్పాటుచేసిన మహిళా శక్తి క్యాంటీన్ వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలు ఆర్థిక పరిపుష్టిని సాధించేలా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను రూపకల్పన చేసిందని చెప్పారు. ఒక క్యాంటీనే కాకుండా పౌల్ట్రీ, డైరీ, సౌర విద్యుత్తు తదితర రంగాలలో మహిళలకు చేయూతనిచ్చేందుకు ముందుకు వచ్చినట్లు చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాలను మహిళలు అందిపుచ్చుకోవాలని తెలిపారు. మహిళలు ప్రశ్నించేతత్వం అలవర్చుకున్నప్పుడే సమాజంలో గౌరవాన్ని పొందుతారని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధిని సాధించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో హాలియా మున్సిపల్ చైర్ పర్సన్ ఎడవల్లి అనుపమ నరేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి, కాకునూరి నారాయణ గౌడ్, ఎడవల్లి నరేందర్ రెడ్డి, కౌన్సిలర్లు గౌని సుధారాణి రాజా రమేష్, దీపావత్ ప్రసాద్ నాయక్, నలబోతు వెంకటయ్య, వజ్ర వెంకటరెడ్డి, పిల్లి ఆంజనేయులు, గౌని రాజా రమేష్, వెంపటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## హమాలీ కూలీ రేట్లు పెంచండి



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** గోదావరిఖని కూరగాయల మార్కెట్‌లో కూలీ రేట్లు పెంచాలని అడిగితే హమాలీ వర్కర్లను దొంగలుగా చిత్రికరిస్తున్న హోల్‌సేల్ వ్యాపారుల వైఖరిని నిరసిస్తూ ప్లకార్డులతో గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎంఎగౌస్ మాట్లాడుతూ కూరగాయల మార్కెట్‌లో పని చేస్తున్న హమాలీలకు కూలీ రేట్లు పెంచాలని కొన్ని నెలలుగా హోల్ సేల్ వ్యాపారులను అడగడం జరిగిందని, కానీ కూలీ రేట్లు పెంచకుండా హోల్ సేల్ వ్యాపారులు నిర్లక్ష్యం వహిస్తూ హమాలీలను దొంగలుగా అవమానిస్తున్నారని ఆయన ఆరోపించారు. కూలీ రేట్లు పెంచాలని ఆందోళన చేస్తే అవహేళన చేస్తూ, సమస్య పరిష్కరించడం లేదని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా హోల్‌సేల్ వ్యాపారులు నిర్లక్ష్యాన్ని వీడి హమాలీ కార్మికులకు కూలీ రేట్లు పెంచాలని హెచ్చరించారు. కార్యక్రమంలో హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు కండె లక్ష్మయ్య, రాంచందర్, సతీష్, జానీమియా తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకిచ్చిన హామీలు అమలు చేయాలి : సిపిఐ డిమాండ్

**ప్రజాపక్షం/హుస్నాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దివ్యాంగుల పింఛను రూ.6వేలు పెంచుతామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని సిపిఐ మండల కార్యదర్శి గడిపె మల్లేశ్ డిమాండ్ చేశారు. గురువారం హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయం ఎదుట నియోజకవర్గ దివ్యాంగుల సంఘం అధ్వర్యంలో చేపట్టిన దీక్ష శిభిరాన్ని సిపిఐ నాయకుల సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా గడిపె మల్లేశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా దివ్యాంగుల పింఛన్ పెంపు విషయం మరిచిపోయారన్నారు. దివ్యాంగులు చాలీచాలని పింఛనుతో కాలం గడుపుతున్నారని వెంటనే వారికి రూ.6వేల పింఛను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హతగల దివ్యాంగులకు ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇల్లు మంజూరులో ప్రాధాన్యం ఇవ్వాలని అయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు సంజీవరెడ్డి, మల్లారెడ్డి, దివ్యాంగుల సంఘం నాయకుడు గుగులోతు రాజేశ్వరి, సమ్మయ్య, వెంకటలక్ష్మి , తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు అండగా సిపిఐ



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** సిపిఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం 10వ డివిజన్ హనుమాన్ నగర్‌లో పార్టీ కరీంనగర్ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు ప్రారంభించి మాట్లాడారు. సిపిఐ వంద సంవత్సరాలు పూర్తి చేసుకుని డిసెంబర్ 26 శతాబ్ది ఉత్సవాలకు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో శ్రామిక ప్రజల దళిత, బహుజనుల, బడుగు, బలహీన వర్గాల హక్కుల కొరకు సమసమాజ వ్యవస్థ ఏర్పడాలని సమాజంలో కుల వివక్షత, ఆర్థిక, సాంఘిక, అసమానతలు తొలగిపోవాలని నిర్విరామ పోరాటాలు చేస్తుందన్నారు. పేద ప్రజలకు భూములు పంచిన చరిత్ర సిపిఐదేనన్నారు. సిపిఐ పోరాటాల ఫలితంగానే కార్మిక చట్టాలు కొనసాగుతున్నాయన్నారు. సిపిఐ పదవ డివిజన్ నాయకులు బైరి విజయ్, వీర నారాయణ, సుగ్రీవు, శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కోనోకార్పస్ చెట్లు తొలగించాలి

### ప్రభుత్వ విప్‌కు సిపిఐ వినతి

**ప్రజాపక్షం/వేములవాడ :** పట్టణంలో కోనోకార్పస్ చెట్లు తొలగించాలని సిపిఐ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జ్ కడారి రాములు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌ఆది శ్రీనివాస్‌ని గురువారం వినతిపత్రం అందజేశారు. డబ్ల్యూహెచ్‌ఓ సైతం ప్రపంచ వ్యాప్తంగా కోనోకార్పస్ చెట్లను నిషేదించినప్పటికీ గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం హరితహారంలో ఈ విషవృక్షాలను పెట్టారని, వీటిలో కేబుల్ వ్యవస్థ, నీటి ఊటలు, మనిషికి, జీవకోటి శ్వాసకోశ సంబంధిత వ్యాధులు వస్తాయని, వెంటనే వేములవాడ పట్టణంలో కోనోకార్పస్ చెట్లను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు అజ్జ వేణు, కె.వి.అనసూర్య తదితరులు పాల్గొన్నారు.

## అథ్లెటిక్‌లో విద్యార్థి ప్రతిభ




**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెట్‌పల్లిలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్, ఎంపిక పోటీలలో జావెలిన్ త్రో సబ్ జూనియర్ విభాగంలో ధర్మపురి ఆంగ్లోవేదిక్ పాఠశాల విద్యార్థి మహమ్మద్ రజ్దాన్ కాంస్య పతకం గెలుపొందాడు. జిల్లా స్థాయి పోటీలలో పతకం సాధించిన విద్యార్థిని పాఠశాల కరస్పాండెంట్ సంగనబట్ల దినేష్, ప్రిన్సిపాల్ తోట శంకర్, డైరెక్టర్లు గట్ల శ్రీనివాస్, ఎస్. సంతోషి, పాఠశాల సిబ్బంది అభినందించారు.

## సిబ్బంది సంక్షేమం కోసం కృషి

### సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న యాదగిరి కానిస్టేబుల్ గుండెనొప్పితో మృతిచెందగా పోలీసు శాఖ భద్రత పథకంలో 8 లక్షల రూపాయల చెక్కును సిపి అనురాధ కుటుంబ సభ్యులకు అందచేశారు. ఈసందర్భంగా సిపి అనురాధ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమం కోసం ఎల్లప్పుడు పోలీసు శాఖ కృషిచేస్తుందని, భద్రత పథకం సిబ్బంది కుటుంబాల ఆర్థికంగా నిలదొక్కుకోవటానికి బాసటగా నిలుస్తుందన్నారు. పోలీసు కుటుంబ సభ్యులు ఏవైన సమస్యలు ఉంటే నేరుగా వచ్చి కలువాలని సూచించారు. పోలీసు శాఖ నుండి ప్రభుత్వం నుండి వచ్చే డబ్బులను సక్రమంగా వినియోగించుకోవాలని కుటుంబ సభ్యులకు సూచించారు. ఈకార్యక్రమంలో ఏవ యాదమ్మ, సూపరింటెండెంట్ అలిషా, రాష్ట్ర పోలీసు సంఘం ఉపాధ్యక్షులు మన్నె రవీందర్‌రెడ్డి, యాదగిరి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నిస్వార్థంగా సేవ చేసినప్పుడే ప్రజలకు నమ్మకం

### అవినీతి నిరోధకశాఖ డిజి విజయ్‌కుమార్

### కరీంనగర్‌లో ట్రైనింగ్ పోలీసుల పాసింగ్ అవుట్ పరేడ్






**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** నిస్వార్థంగా నిజాయితీతో సేవ చేసినప్పుడే పోలీసుల పట్ల ప్రజలకు నమ్మకం పెరుగుతుందని అవినీతి నిరోధకశాఖ డిజి విజయ్ కుమార్ అన్నారు. కరీంనగర్ రాంనగర్‌లో గల పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో రాచకొండ, సైబరాబాద్, హైదరాబాద్ కమిషనరేట్‌లకు చెందిన 1102 మంది సివిల్, ఎఆర్ కానిస్టేబుళ్ల శిక్షణ పూర్తికావడంతో గురువారం పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజయ్ కుమార్ హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ డిజికి స్వాగతం పలికారు. పాసింగ్ అవుట్ పరేడ్‌లో ట్రైనీ కానిస్టేబుళ్లు నిర్వహించిన కవాతు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా డిజి విజయ్ కుమార్ మాట్లాడుతూ శిక్షణార్థులు సాంకేతికతను మెరుగుపరచుకుని చట్టాలపై అవగాహన పెంచుకుంటూ మానసికంగా, శారీరకంగా సన్నద్ధం కావాలన్నారు. ఉద్యోగంలో క్రమశిక్షణతో పాటు ప్రజలను హక్కులను కాపాడుతూ వారి పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులు, మహిళలు, పిల్లలు, వృద్ధుల పట్ల నిస్వార్థంగా వ్యవహరించాలన్నారు. ప్రతిచర్య పోలీసుశాఖ గౌరవ ప్రతిష్టలు పెంచేలా ఉండాలని, వృత్తిపరంగా ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్ల ప్రజలకు మెరుగైన సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. అనంతరం శిక్షణలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. వారికి శిక్షణ నిచ్చి కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్, సిబ్బందిని అభినందించి జ్ఞాపికలు అందజేశారు.

### పోలీసుశాఖలో ఉద్యోగం గౌరవం

### కమలాసన్‌రెడ్డి

పోలీసు ఉద్యోగం అంటే గౌరవం అని డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డిజి వివి కమలాసన్‌రెడ్డి అన్నారు. కరీంనగర్‌లోని సిటీ ట్రైనింగ్ సెంటర్‌లో రాచకొండ కమిషనరేట్‌కు చెందిన 248మంది ఎఆర్ కానిస్టేబుళ్లు బేసిక్ ఇండక్షన్ ట్రైనింగ్‌ని పూర్తిచేశారు. పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డిజి వివి కమలాసన్‌రెడ్డి, కరీంనగర్ సిపి అభిషేక్ మొహంతి హాజరయ్యారు. సిటిసి ప్రిన్సిపాల్ అడిషినల్ డిసిపి ఎ.లక్ష్మి నారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఎసిపి వేణుగోపాల్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగంలో అనేక సవాళ్లు ఎదురవుతాయని, వాటిని ఎదుర్కొని పరిష్కరించేందుకు ఎల్లప్పుడు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు పోలీస్‌శాఖలో ఉద్యోగం సాధించడం గొప్ప అవకాశంగా భావించాలన్నారు. శిక్షణలో బెస్ట్ ఇన్‌ఫైరింగ్ ఆర్.రాకేశ్, బెస్ట్ ఇన్ ఔట్ డోర్ ఎన్.రాకేశ్, బెస్ట్ ఇన్ ఇండోర్ మహ్మద్ అహ్మద్ పాషా, బెస్ట్ ఆల్‌రౌండర్ ఎ.సురేష్, బెస్ట్ ఇన్ పరేడ్ కమాండర్ ఎం.మహేష్‌లకు జ్ఞాపికలు అందజేశారు.

## తేమ వచ్చిన ధాన్యం కొనుగోలు

### జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్



**ప్రజాపొక్షః/జగిత్యాల ప్రతినిధిః** తేమ వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసి వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం మేడిపల్లి మండలంలో ఐకెపి సెంటర్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సెంటర్లలో ట్యాబ్ డాటా ఎంట్రీ చేస్తున్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతుల కొనుగోలు ప్రక్రియని ట్యాబ్ డేటా ఎంట్రీ పూర్తి స్థాయిలో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. రాయికల్ మండలంలోని మైతాపూర్ అంగన్‌వాడీ సెంటర్‌ను కలెక్టర్ .సత్యప్రసాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగాపిల్లలకు సంబంధించిన రిజిస్టర్ పరిశీలించారు. మైతాపూర్ గ్రామంలోని నర్సరీని సందర్శించి ప్రజలకు ఉపయోగపడే పండ్లు పూల మొక్కలను పెంచాలని సూచించారు.

# ధర్మపురి పుణ్యక్షేత్రం అభివృద్ధికి కృషి

### మంత్రి శ్రీధర్‌బాబు



**ప్రజాపక్షం/ధర్మపురి :** ధర్మపురి పుణ్యక్షేత్రం అభివృద్ధికి కృషి చేస్తామని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. గురువారం మంచిర్యాలలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని వేములవాడకు వెళ్తున్న సందర్భంలో మార్గమధ్యలో ఉన్న ధర్మపురిలోని ఎమ్మెల్యే కార్యాలయాన్ని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆహ్వానం మేరకు మంత్రి సందర్శించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ ధర్మపురి లక్ష్మి నృసింహుడి ఆశీస్సులతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, అందుకు స్వామివారి రుణాన్ని తప్పక తీర్చుకుంటామని తెలిపారు. దేవాలయం అభివృద్ధి విషయంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ దృష్టికి లక్ష్మణ్‌కుమార్ తీసుకెళ్లడం జరిగిందని అందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. దేవాలయ అభివృద్ధి పనుల విషయంలో ఒక ప్రణాళిక తయారు చేసి పంపించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో విద్య, వైద్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని గడిచిన సంవత్సర కాలంలో రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. రైతులకిచ్చిన వాగ్దానాలను ప్రభుత్వం తప్పక అమలు చేస్తుందని, రూ.2లక్షల రుణం తీసుకున్న రైతులకు తప్పక మాఫీ చేస్తుందని తెలిపారు. దొడ్డ రకం పండించిన రైతులకు మద్ధతు ధరతో పాటు సన్న రకం పండించిన రైతులకు 500రూ.ల బోనస్ ప్రభుత్వం ప్రకటించిందని ఎన్ని ఇబ్బందులైనా రైతాంగానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఎస్.దినేష్, వేముల రాజు, చిలుముల లక్ష్మణ్, చీపిరిశెట్టి రాజేష్, జక్కు రవీందర్, కస్తూరి శ్రీనివాస్, జెఎస్ ప్రసాద్, కుంట సుధాకర్, స్థంభంకాడి గణేష్, ఎండి షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నైపుణ్యంతో కూడిన విద్య

### కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** ప్రభుత్వ పాఠశాలల్లో నైపుణ్యంతో కూడిన విద్యను అందిస్తున్నామని, ఇందుకు ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని, తద్వారా విద్యార్థులు భవిష్యత్తులో వివిధ రంగాల్లో నైపుణ్యం సాధించి నిష్ణాతులవుతారని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కొత్తపల్లి (హవేలీ)లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉదయం ప్రార్థన కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. విధ్యార్థులతో కలిసి ప్రార్థన చేశారు. పాఠశాలలో విద్యా విధానం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కలెక్టర్ మాట్లాడుతూ జన్య ఫౌండేషన్ ఆద్వర్యంలో జిల్లాలోని వంద ప్రభుత్వ పాఠశాల్లోని 200 మంది ఉపాధ్యాయులకు లైఫ్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ ఉపాధ్యాయులు విద్యార్థులకు తరగతి గదితో పాటు ప్రయోగాత్మక విద్య బోధిస్తారన్నారు.భూమి విస్తీర్ణం, నేల రకం, కాలానికనుగుణంగా పంటల ఎంపిక, సేంద్రీయ ఎరువులు, వాతావరణం అంచనా, మార్కెటింగ్ వంటి అంశాలపై విద్యార్థులకు ప్రయోగాత్మక బోధన ఈ లైఫ్ స్కిల్స్ విద్యలో భాగమని తెలిపారు. తద్వారా విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో అవగాహన పెంపొందించుకుని భవిష్యత్తులో ఆయా రంగాల్లో నిష్ణాతులవుతారని తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులు ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్‌లో విత్తనాల నాటుతున్న విధానాన్ని పరిశీలించారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కొత్తపెల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు, సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి, జన్య ఫౌండేషన్ మేనేజర్ సురేంద్ర కుమార్, ఎంఈవో అజీమ్, తహసీల్దార్ రాజేష్, ప్రధానోపాధ్యాయురాలు వెంకట పద్మాదేవి తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందడుగు

### జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని వివేకానంద మినీ స్టేడియంలో డిసెంబర్ 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా స్థాయి దివ్యాంగుల క్రీడాపోటీలను ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యంగులు ఆత్మస్థర్యంతో ముందుకు సాగాలని, సమాజంలో అందరితోపాటు దివ్యంగులు సమానమేనని, ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. తాను రాజకీయాలలోకి రాక ముందు రోటరీ క్లబ్ ఆఫీస్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో దివ్యాంగుల సేవా కార్యక్రమాలలో పాల్గొన్నానని తెలిపారు. బ్యాటరీ సైకిల్స్, కృత్రిమ కాలు, చేతు అవయవాలు అందజేయటం జరిగిందని వివరించారు. డబల్ బెడ్‌రూం ఇండ్లలో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించి మంజూరు చేయటం జరిగిందన్నారు. క్రీడలకు సంబందించి ముగింపు సంబరాల్లో తన వంతుగా విజేతలకు బహుమతులు అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా దివ్యంగుల సంక్షేమ అధికారి డా.నరేష్, కౌన్సిలర్ చుక్క నవీన్, ఎస్‌జిఎఫ్ జిల్లా సెక్రటరీ లక్ష్మి రాంనాయక్, మెప్మా ఎఒ శ్రీనివాస్ గౌడ్, డివైఎస్‌ఓ రవి కుమార్, జిల్లా బాలల సంరక్షణ అధికారి హరీష్, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ సభ్యుడు సిరిసిల్ల శ్రీనివాస్, గొడిసెల గంగాధర్, లంకదాసరి శ్రీనివాస్, జాన్సన్, సత్యనారాయణ, అజీజ్, శ్రవణ్, బాబా, సంబధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ క్రైమ్‌పై ప్రత్యేక దృష్టి

### ఎన్‌ఫోర్స్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ యంత్రాంగం ప్రత్యేకంగా ఎక్సైజ్ క్రైమ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎక్సైజ్ క్రైమ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి ఆదేశించారు. గురువారం కరీంనగర్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల ఎక్సైజ్ సూపరిండెంట్ల పరిధిలో జరుగుతున్న పనితీరుపై సమీక్షించారు. ఎక్సైజ్ అధికారులు డ్రగ్స్, గంజాయి, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌తో పాటు నాటుసారా తయారీ, రవాణా, అమ్మకాలపై ప్రత్యేకంగా నిఘా పెట్టాలన్నారు. వీటితో పాటు పోలీస్ స్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుబడిన గంజాయి, డ్రగ్స్‌ను డిస్పోజల్ అధికారి అనుమతితో కాల్చివేయాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం రాకుండా చర్యలు పెట్టాలన్నారు. స్టేషన్‌లో చార్జిషీట్ వేయని కేసుల్లో వెంటనే చార్జిషీట్స్ వేయాలని కేసుల్లో శిక్షలు పడేవిధంగా చర్యలు చేపడితే ఎక్సైజ్ క్రైమ్ చేయాలంటే నేరస్థులు భయపడుతారన్నారు. మద్యం ఎంఆర్‌పి ధరలు కంటే ఎక్కువ ధరలకు అమ్మకాలు జరిపే విషయంపై కూడా చర్యలు చేపట్టాలన్నారు. ఎక్సైజ్ సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇస్తూ మంచి ఫలితాలను రాబట్టాలన్నారు. ఈ ఎక్సైజ్ సమీక్ష సమావేశంలో కరీంనగర్ డిప్యూటీ కమిషనర్ టి.డేవిడ్ రవికాంత్, అసిస్టెంట్ కమిషనర్ కె.వరప్రసాద్, కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి ఎక్సైజ్ సూపరిండెంట్లు పి.శ్రీనివాసరావు, ఎ.సత్యనారాయణ, ఎస్.పంచాక్షరీ, ఆర్.మల్లారెడ్డి పాల్గొన్నారు.

# జనవరినాటికి ఆయిల్ పామ్ ప్లాంటేషన్ పూర్తి





### పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** పెద్దపల్లి జిల్లాలో మరో 950 ఎకరాలలో ఆయిల్ ఫామ్ మొక్కల ప్లాంటేషన్ జనవరి నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఆయిల్ ఫామ్ మొక్కల గ్రౌండింగ్ పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్దేశించుకున్న లక్ష్యాల మేరకు ఆయిల్ ఫామ్ మొక్కల ప్లాంటేషన్ సాధన దిశగా వ్యవసాయ అధికారులు, ఉద్యానవన శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. ఆయిల్ ఫామ్ సాగుకు ముందుకు వచ్చిన రైతుల నుంచి మొక్కలకు, డ్రిప్ కోసం వెంటనే డీడీలు సేకరించాలని కలెక్టర్ తెలిపారు. డీడీలు సమర్పించిన రైతులకు మొక్కల సరఫరా, డ్రిప్ సౌకర్యం ఏర్పాటు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డిహెచ్‌ఎస్‌ఒ జగన్మోహన్ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### పిఎం అజయ్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

పిఎం అజయ్ పథకానికి ఆసక్తి గల ఎపి రైతులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల ఎస్సీ రైతులు తమ దరఖాస్తు లతో పాటు పట్టాదారు పాసు పుస్తకం కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు , రేషన్ కార్డ్ పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలను జత చేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

### సక్రమంగా ధాన్యం దిగుమతులు

**సుల్తానాబాద్ :** రైస్ మిల్లులలో ధాన్యం దిగుమతి చేసే ప్రక్రియ సక్రమంగా జరిగేలా చూడాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం సుల్తానాబాద్ మండలం పూసాల గ్రామంలో ఉన్న వసుంధర రైస్ మిల్లును కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైస్‌మిల్లుకు అలాట్ ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఇప్పటి వరకు ఎంత ధాన్యం వచ్చింది, వాటి వివరాలను, రిజిస్టర్‌లను కలెక్టర్ పరిశీలించారు. కొనుగోలు చేసిన ధాన్యం సంబంధించి రైస్ మిల్లుల వద్ద త్వరగా దిగుమతి చేసుకునేలా చూడాలని, రైస్ మిల్లులు వద్ద ఎక్కువ సమయం ధాన్యం వాహనాలు వెయిట్ చేయకుండా చూడాలని, అవసరమైన మేర హమాలీలు అందుబాటులో ఉంచుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను త్వరితగతిన ఓపిఎంఎస్ వెబ్ సైట్‌లో నమోదు చేయాలన్నారు.

# కెసిఆర్ దీక్షతోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం

### ఎమ్మెల్యే గంగుల కమలాకర్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః** కరీంనగర్ నగరంలో ఈనెల 29న ఘనంగా దీక్షా దివస్ కార్యక్రమం చేస్తామని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. గురువారం నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జి.వి రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ పలువురు బిఆర్‌ఎస్ కార్పోరేటర్లతో కలిసి సుభాష్‌నగర్, అలుగునూరు ప్రాంతాల్లో పర్యటించారు. బిఆర్‌ఎస్ అధిష్టానం నిర్ణయం మేరకు కరీంనగర్‌లోనే దీక్షా దివస్ కార్యక్రమం నిర్వహించబోయే ఏర్పాట్లలో బాగంగా రెండు చోట్లా దీక్షా దివాస్ సభ కోసం స్థల పరిశీలన చేశారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూతెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు దీక్షతోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన సాధ్యమయిందన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం గత 60 సంవత్సరాలుగా పోరాటం చేసిన ఆనాటి రాజకీయ నాయకులు వారి స్వలాభం కోసం ఉద్యమాన్ని వాడుకున్న పరిస్థితులు కల్లారా చూశామని గుర్తు చేశారు. నగరంలోని తీగలగుట్టపల్లి నుంచి కెసిఆర్ దీక్షను చేపట్టేందుకు బయలుదేరారు కాబట్టే ఆరోజును దీక్షా దివాస్‌గా చేయడం జరుగుతుందని తెలిపారు. నవంబర్ 29న పెద్ద ఎత్తున దీక్షా దివాస్ కార్యక్రమం చేపట్టబోయేందుకు నగరంలో రెండు చోట్ల సభ కోసం స్థల పరిశీలన చేశామని తెలిపారు. కార్పోరేటర్లు కంసాల శ్రీనివాస్, నక్క పద్మ కృష్ణ, నాంపల్లి శ్రీనివాస్, బిఆర్‌ఎస్ నాయకులు కర్ర సూరి తదితరులున్నారు.

## విలువలతో కూడిన విద్యాబోధన

### మోడల్ పాఠశాలల డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్ :** ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యాబోధన చేయాలని మోడల్ పాఠశాలల డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ సూచించారు. గురువారం జగదేవ్‌పూర్‌లోని ఆదర్శ పాఠశాలను సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు ఉత్తమ బోధన అందిస్తేనే వారు సమాజంలో ప్రయోజితులవుతారని తెలిపారు. రానున్న వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి ఆదర్శ పాఠశాలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తేవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పేర్కొన్నారు. అనంతరం పది, ఇంటర్ విద్యార్థులతో సమావేశమై పాఠశాలలో కొనసాగుతున్న బోధన గురించి, పాఠశాలలో వారికి అందుతున్న సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రానున్న పరీక్షలకు ఏ విధంగా సన్నద్ధం కావాలో వివరించారు. అనంతరం పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన లాంగ్ జంప్ పిట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎఎంఒ మంజరి, రవికుమార్, ప్రిన్సిపాల్ కాట స్లీవరాజు, రాము, ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను అభినందించిన మంత్రి తుమ్మల



ప్రజాపక్షం/పిట్లం: జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు హైదరాబాద్‌లో వ్యవసాయ, మార్కెటింగ్, కోఆపరేటివ్ చేనేత టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావ్‌ను, కిసాన్ జాతీయ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు, వ్యవసాయ, రైతు సంక్షేమ కమీషన్ చైర్మెన్ కోదండరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మద్నూర్ ఏఎంసీ చైర్మెన్ ఎంపిక విదానాన్ని గురించి మంత్రికి వివరించారు. దేశంలోనే ఏ రాజకీయ నాయకుడు చేయని సాహసం చేసి, అందరికి ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్యేను మంత్రి కొనియాడారు. రాజకీయాల్లోకి యువతను ప్రోత్సాహించడం శుభపరిణామమని పేర్కొన్నారు. అనంతరం మద్నూర్ ఏఎంసీ చైర్మెన్‌గా ఎంపికైన సౌజన్యను మంత్రి తుమ్మల, కోదండరెడ్డిలు అభినందించారు.

## పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి



ప్రజాపక్షం/కాసిపేట: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని మధ్యాహ్నం భోజన కార్మికులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, ఒక విద్యార్థికి ప్రభుత్వం అందించే మొత్తం ఏ మాత్రం సరిపోవడం లేదని వాపోరారు. కిరాణా సరుకులు, గ్యాస్, కట్టెల ధరలు విపరీతంగా పెరిగాయని అన్నారు. నాలుగు నెలలుగా ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదని, బిల్లులు రాకపోవడంతో కిరాణా షాపుల్లో సరుకులు ఇవ్వడం లేదని అన్నారు. ప్రభుత్వం తమకు అందించే వెయ్యి రూపాయల జీతం ఏ మాత్రం సరిపోవటం లేదని, వేలాది రూపాయలు వెచ్చించి అప్పులు తీసుకొచ్చి పిల్లలకు నాణ్యమైన భోజనం పెడుతున్న నెల నెల బిల్లులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలకు కోడిగుడ్లు పెట్టడం మూలంగా షాపుల్లో కోడిగుడ్డు ధర ఏడు రూపాయలు ఉండగా, ఐదు రూపాయలే కటిస్తున్నారని, తాము అదనంగా రెండు రూపాయలు నష్టపోతున్నామని, నష్టపోతున్న రెండు రూపాయలను ప్రభుత్వమే చెల్లించాలని అన్నారు. కూరగాయల ధరలు సైతం వివరీతంగా పెరిగాయని అన్నారు. ఇప్పటికైనా తమ ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని కోరారు.

## షేర్ ఏ పంజాబీ దాబాలో మత్తు మందు స్వాధీనం



ప్రజాపక్షం/వెల్దుర్తి: మెదక్ జిల్లా మాసాయిపేట మండల కేంద్రంలోని ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ సిఐ వీనారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం దాడులు నిర్వహించి షేర్ ఏ పంజాబ్ ధాబాలో 128 గ్రాముల పాపిస్ట్రీ మత్తు మందు పొడిని సాయంత్రం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ మత్తుమందు డ్రాగ్ హెరాయిన్ తయారీకి వినియోగిస్తారని తెలిపారు. ధాబాలో మేనేజర్ గా పని చేస్తున్న రవీందర్ సింగ్ ఈ మత్తుమందును లారీ డ్రైవర్లకు క్లీనర్లకు ఇతరులకు విక్రయిస్తున్నాడని అందిన విశ్వాసనియ సమాచారం మేరకు దాడి నిర్వహించామని సిఐ వీనారెడ్డి తెలిపారు. ఈ మత్తుమందును టీ లలో లేదా పాలలో లేదా నేరుగా కొద్దిపాటిగా తీసుకుంటే మత్తు వస్తుందన్నారు. ఈ మందును విక్రయించడం వినియోగించడం చట్ట విరుద్ధమని చెప్పారు. తదుపరి చట్టపరమైన చర్యల కోసం స్వాధీనం చేసుకున్న మత్తుమందు పొడిని అదుపులోకి తీసుకున్నా రవీందర్ సింగ్ ఎక్సైజ్ శాఖ రామాయంపేట సిఐటి అప్పగించడం జరుగుతుందని వీణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అనిల్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ ఆజం, కానిస్టేబుళ్లు గోపాల్ ఉమా తదితరులు ఉన్నారు.

## ఐటిడిఎ డిడి అకస్మిక తనిఖీ..



ప్రజాపక్షం/నేరడిగొండ: నేరడిగొండ మండలంలోని లక్కంపూర్ ప్రభుత్వ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఐటీడీఏ డిడి జాదవ్ వసంతరావు,ఆకస్మిక తనిఖీ చేశారని ప్రధానోపాధ్యాయులు అశోక్ తెలిపారు. డిడి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనము, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. వచ్చే పదవ తరగతి బోర్డ్ పరీక్షలలో ప్రతి ఒక్క విద్యార్థి కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని సూచిస్తూ పదికి పది జీపీఏ సాధించాలని అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపెట్టాలని సూచించారు. ఆయనతో పాటు ఉపాధ్యాయ సిబ్బంది. ఏఎన్ఎం, విద్యార్థులు ఉన్నారు.

## గుంతలతో అధ్వానంగా అర్లికే రోడ్డు..!



ప్రజాపక్షం/తలమడుగు: దశబ్ద కాలం నుంచి తమ గ్రామానికి బిటి రోడ్డు.సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తలమడుగు మండలంలోని అర్లికే గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అర్లి కే గ్రామం నుంచి బరంపూర్ గ్రామం వరకు రోడ్డు గుంతలతో ఆద్వానంగా తయారైంది. నిత్యం అర్లి కే గ్రామం నుంచి బరంపూర్ గ్రామంలోని పాఠశాలకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వివిధ పనుల మీద నిత్యం ప్రజలు వెళ్తూ ఉంటారు. బరంపూర్, అర్లి కే గ్రామం మధ్యలో ఉన్న వంతెన ఇటీవల కురిసిన వర్షాలకు వంతెన పై గుంతలు ఏర్పడి సగం వంతెన కొట్టుకుపోయింది వర్షకాలం చిన్న వర్షాలు కురిసిన వంతెన పై నుంచి వర్షం పరడం వలన గ్రామంలోని విద్యార్థులు పై చదువులకు దూరం కావలసి వస్తుంది అని ఇప్పటికైనా అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డు, వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

# తూకం వేసిన ధాన్యం వెంటనే మిల్లులకు తరలింపు

### 48 గంటల్లో రైతులకు డబ్బులు అందేలా చూడాలి
### కలెక్టర్ క్రాంతి వల్లూరు



ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి: తూకం వేసిన ధాన్యం వెంటనే మిల్లులకు తరలించేలా చూడాలని ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. గురువారం జిన్నారం మండల కేంద్రంలో ఐకెపి ఆద్వర్యంలో ఏర్పాటు ఏసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్‌వల్లూరు క్రాంతి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని ధాన్యం రైతులకు 48 గంటల్లో డబ్బులు రైతుల ఖాతాలో జమ అయ్యేలా వెంటనే ఆన్లైన్ టాబ్ లని వివరాలు పీడ్ చేయాలని కలెక్టర్ కొనుగోలు కేంద్ర నిర్వాహకులకు సూచించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబందించిన రిజిస్టర్‌లను కలెక్టర్ ఈ సందర్భంగా తనిఖీ చేసి సంబందిత సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఇప్పటి వరకు వచ్చిన ధాన్యం వివరాలు సన్నదాన్యకు సంబందించిన బోనస్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్దనే అమ్ముకొని మద్దతు దర పొందాలని రైతులకు సూచించారు. ధాన్యం బస్తాలను తూకం వేసిన వెంటనే ధాన్యం బస్తాల లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసి సంబందిత మిల్లులకు తరలించాలని ఆదేశించారు. దాన్యం కొనుగోళ్లను త్వరితగతిన పూర్త చేయాలన్నారు. ఎటువంటి అలసత్వం వహించరాదన్నారు. ఓపిఎంఎస్ లో రైతు పేరు. ఫోన్ నెంబర్, దాన్యం బస్తాలు, తదితర కొనుగోళ్ల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. రైతులు దాన్యం తీసుకొచ్చిన వెంటనే తూకం జరిపించాలని రైతులకు ఏమైనా సమస్య ఉంటే తమ దృష్టికి తెచ్చి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. రైతులు దాన్యం ఆరబెట్టుకొని నిబందనల ప్రకారం తేమ శాతం ఉండే విదంగా చూసే దాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి,జిల్లా పౌరసరఫరా శాఖ జి.ఎం. కొండల్‌రావు ,అదనపు డిఆర్‌డి ఓ జంగారెడ్డి తహసీల్దార్ బిక్షపతి ఎంపిడిఓ అరుణారెడ్డి, సంబందిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు ఆసుపత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యే అనిల్



ప్రజాపక్షం/బోథ్ : బోథ్ మండల కేంద్రంలో నూతన ఏర్పాటు చేసిన లక్ష్మీ చైత్ర హాస్పిటల్ ను గురువారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఎంపి గోడం నగేష్ లు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్యే, ఎంపి లను శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిర్వాసితులను.. నమ్మించి వంచించిన కెసిఆర్

### సిపిఐ ఇంచార్జి శివలింగు కృష్ణ



ప్రజాపక్షం/గజ్వేల్: కెసిఆర్, హరీష్ రావులు నిర్వాసితులను మాయమాటలతో నమ్మించి గొంతు కోసినట్లు గజ్వేల్ సిపిఐ ఇన్చార్జి శివ లింగు కృష్ణ పేర్కొన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ముంపు బాధితులకు అన్ని ప్యాకేజీలు ఇచ్చామని గత ప్రభుత్వం గొప్పలు చెప్పుకోగా, నిర్వాసితులకు ఇచ్చిన ప్యాకేజీల కాలి గోటితో సమానమని అన్నారు. మల్లన్న సాగర్ నిర్మాణ సమయంలో ఇల్లుకు ఇల్లు, బడికి బడి, గుడికి గుడి ఇస్తామని చెప్పి ఊర్లను ఖాళీ చేయించగా, చస్తే బొంద పెట్టడానికి కూడా జాగా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వాసితుల పట్ల కపట ప్రేమ చూపించిందని, పుట్టిన ఊరిని వదిలి ఎక్కడో అనాధలుగా నివాసాలు ఏర్పాటు చేశారని, అక్కడ కూడా ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా నిర్వాసితులను గాలికి వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారం కోల్పోయాక నిర్వాసితులను కన్నబిడ్డల చూసుకొని అన్ని సౌకర్యాలు కల్పించామని అబద్ధాల ప్రచారం చేస్తున్నారని గత పాలకులపై ఆయన ఘాటుగా విమర్శించారు. మల్లన్న సాగర్ భూనిర్వాసితుల సమస్యలు తెలుసుకొని అసెంబ్లీలో ప్రస్తావించడానికి రేపు ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో పర్యటించి నిర్వాసితుల సమస్యలు తెలుసుకుని అసెంబ్లీలో ఎర్రజెండా సాక్షిగా నిర్వాసితులకు అండగా ఉండి పోరాటం చేస్తారని శివలింగ కృష్ణ వివరించారు.

## ట్రైనీ కానిస్టేబుళ్లకు హార్థిక శుభాకాంక్షలు

### విమెన్ సేఫ్టీ వింగ్ డిఐజి రెమా రాజేశ్వరి




ప్రజాపక్షం /సంగారెడ్డి ప్రతినిధి: తొమ్మిది నెలల ప్రాథమిక శిక్షణను పూర్తి చేసుకున్న 5 జిల్లాలకు చెందిన ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్ల పాసింగ్ ఔట్ / దీక్షత్ పరేడ్‌ను ఈ రోజు సంగారెడ్డి జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం చిద్రుప్ప లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విమెన్ సేఫ్టీ వింగ్ డిఐజి రెమా రాజశ్వరి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి ,జిల్లా ఎస్‌పి చెన్నూరి రూపేష్ విశిష్ట అతిథిగా హాజరై ట్రైనీ కానిస్టేబుళ్ల నుండి గౌరవ వందనం స్వీకరించారు. పాసింగ్ అవుట్ / దీక్షాంత్ పరేడ్‌కు ట్రైనీ కానిస్టేబుల్ బాలకృష్ణ పరేడ్ కమాండర్ గా వ్యవహరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ సైబరాబాద్ ములుగు భద్రాది ,కొత్తగూడెం, సిపియల్ అంబర్ పేట్ రాజన్న సిరిసిల్ల మొత్తం 5 జిల్లాలకు చెందిన 224 మంది స్టైపెండర్ కాడెడ్ ట్రైనీ ఆర్మూర్ రిజర్వ్ పోలీస్ కానిస్టేబుల్స్ 9 నెలల శిక్షణ నిమిత్తం సంగారెడ్డి జిల్లాలోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్ చిద్రుప్పలో తేది 21/02/2024 నాడు రిపోర్ట్ చేయడం జరిగిందని వీరికి శిక్షణలో భాగంగా నూతన చట్టాలతో పాటు స్పెషల్ అండ్ లోకల్ టాస్ క్రైమ్ ఇన్వెస్టేగేషన్ ఇటిలిజెన్స్ అండ్ ఇంర్నల్ సెక్యూరిటీ పర్సనాలిటీ డెవలప్మెంట్, ఆర్మూడ్ లారీ డ్రిల్ వంటిని నేర్పించడం జరిగిందన్నారు. పోలీసు శాఖ అంటేనే క్రమ శిక్షణకు మారుపేరు . అలాంటి పోలీసు శాఖలో నేటి నుంచి పూర్తి స్థాయి కానిస్టేబుల్స్ గా విధులు నిర్వహిస్తూ మంచి ప్రవర్తనను కలిగి ప్రజలకు సేవలందించాలని సూచించారు. ఈ 9 నెలల ట్రేనింగ్ జీవితాంతం శారీరకంగా ,మానసికంగా ఫీట్ గా ఉండటానికి తోడ్పడుతుందని రోజు వ్యాయామం చేస్తూ ఈ పిట్స్‌ను కొనసాగించాలన్నారు. నిజాయతీ నిబ్బద్ధతతో విధులు నిర్వహిస్తూ తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 9 నెలల ప్రాథమిక శిక్షణను పూర్తి చేసుకున్న ట్రైనీ కానిస్టేబుల్స్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్ని విపత్కర పరిస్థితులలో పోలీసు శాఖ సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు అందుకోవడం జరుగుతుదన్నారు. మహిళల భద్రతలకు ప్రజల ధన ,మాన, ప్రాణ, రక్షణలో పోలీసు శాఖ అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. ఎన్నో పండుగలు ఉత్సవాలు, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుపుకుంటున్నాం అంటే అందుకు కారణం పోలీసు శాఖ అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి ఎ. సంజీవరావు, టిటీసి ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, వైస్ ప్రిన్సిపల్ రమేష్, డిఎస్‌పి ఇండోర్ ఔట్ డోర్ శిక్షలకు ఎస్‌పి ఇన్స్పెక్టర్ విజయ్ కృష్ణ డిఎస్‌పిలు ఇన్సెక్టర్స్ ఆర్ఐలు, ట్రేనీ కానిస్టేబుల్స్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మూఢ నమ్మకాలు నమ్మవద్దు

ప్రజాపక్షం/అల్లాదుర్గం: బాల్యం దశలో విద్యార్థులు మూఢనమ్మకాలు వీడాలని సిఐ రేణుక రెడ్డి, సైంటిఫిక్ స్టూడెంట్ ఫడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు ఉప్పులేటి నరేష్ అన్నారు. జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు అల్లాదుర్గ్ ఎస్సై ప్రవీణ్ రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం మరియు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వ్యక్తిత్వ వికాసం సైన్సు మూఢనమ్మకాల నిర్మూలన అనే అంశంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సీఐ రేణుక రెడ్డి, ఉప్పులేటి నరేష్ హాజరై మాట్లాడుతూ, సమాజంలోని మూఢనమ్మకాలను విద్యార్థులు వదిలిపెట్టి శాస్త్రీయ సమాజ నిర్మాణానికి నడుం బిగించాలని, దొంగ స్వాములు భూత వైద్యులు ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని ఆర్థికంగా సామాజికంగా మోసం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మూఢనమ్మకాలు లేని శాస్త్రీయ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఉప్పులేటి నరేష్ మాంత్రికులు భూత వైద్యులు మోసం చేసే కుట్రలను సైన్స్ మ్యాజిక్ షో ద్వారా విద్యార్థులకు వాటి వెనుక దాగి ఉన్న రహస్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో భరోసా కేంద్రం శ్రీలత, సౌమ్య, స్పెషల్ ఆఫీసర్ స్రవంతి, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఎమ్మెల్యేకు దీపాదాస్ మున్షీ అభినందన



ప్రజాపక్షం/నిజాంసాగర్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో అఖిల భారత కాంగ్రెస్ సేవాదళ్ 100 సంవత్సరాల ఉత్సవాలు బుధవారం హైదరాబాద్ గాంధీ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు పాల్గొనగా పీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జీ దీపాదాస్ మున్షీలు ఏసీసీ సేవాదళ్ అధ్యక్షుడు లాల్‌జీ దేశాయి, సమద్., హన్మంతురావు, కేశవరావు, కనుకుల జనార్ధన్‌రెడ్డి, తెలంగాణ సేవాదల్ అధ్యక్షుడు జితేందర్ తదితర నాయకుల సమక్షంలో ఈ చారిత్రాత్మక వేడుకలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మద్నూర్ ఏఎంసీ చైర్మెన్ సౌజన్యను పరిచయం చేశారు. ఇంటర్వూ ద్వారా నిరుపేద విద్యావంతురాలైన సౌజన్యనను ఏఎంసీ చైర్మెన్‌గా ఎంపిక చేయడం పట్ల దీపాదాస్ మున్షీ హర్షం వ్యక్తంచేస్తూ రాజకీయాల్లోకి కొత్త సాంప్రదాయాన్ని తీసుకువచ్చిన ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావును అభినందించారు.

## గోమారం చెరువులో చేపపిల్లలు వదిలిన ఎమ్మెల్యే



ప్రజాపక్షం/శివ్వంపేట: శివ్వంపేట మండలం గోమారం గ్రామంలోని చెరువులో గురువారం ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి చేతులమీదుగా చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేపపిల్లలను తక్కువగా వస్తున్నాయని, గతంలో గోమారం చెరువులో లక్షా 80 వేలు వస్తే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో కేవలం 50 వేల చేపపిల్లలు మాత్రమే రావడం విడ్డూరమన్నారు. మరింత ఎక్కువ చేపపిల్లలను వదిలి మత్స్యసంపదతో మత్స్యకారులను ఆదుకోవాలన్నారు. గత బిఆర్ఎస్ హాయంలో సమయానికి చేపపిల్లలను పంపిణీ చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వంలో రెండు నెలలు ఆలస్యంగా పంపిణీ చేయడంతో మత్స్యకారులను ఇబ్బందిపెట్టిననట్టేనని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండలాధ్యక్షులు రమణాగౌడ్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యులు మన్సూర్, నయీమోద్దీన్, లావణ్య మాధవరెడ్డి, సొసైటీ చైర్మన్ కుంట లక్ష్మణ్, ఉన్నారు.

## ఆసుపత్రిని సందర్శించిన డిజి



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి: ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని పోలీసు శాఖ డైరెక్టర్ జనరల్ (డిజి) అనిల్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా స్పెల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్) సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వారికి పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్ మాట్లాడుతూ ఆస్పత్రిలో సిబ్బంది పెంచాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డీజీని కోరామన్నారు. ఆస్పత్రికి సంబంధించిన అన్ని విషయాలపై చర్చించామన్నారు.

## బిసి కులగణన జరిగితేనే హక్కులు



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి: బిసి కులగణన జరిగితేనే మన హక్కులు మనకు అందుతాయని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. నగరంలోని మేరు భవన్‌లో జరిగిన బీసీ కులగణనపై గురువారం జరిగిన బిసి సదస్సులో పాల్గొని మాట్లాడారు. 100 ఏళ్ల తర్వాత మన బీసీ కులగణన జరగాల్సిందేనన్నారు. సోదరులకు అంబేద్కర్ పుణ్యాన వారెంతో వారికి అంత రిజర్వేషన్లు వచ్చాయి. కానీ పట్టుమని 8 శాతం కూడా లేని అగ్రవర్ణాలు 10 ఈడబ్ల్యుఎస్ పేరుతో రిజర్వేషన్లు సాధించారు. మనకు అంత వాటా దక్కాల్సిందే ఈ బిసి కులగణన జరిగితేనే మన రిజర్వేషన్లకు రాజ్యాంగ బద్ధత వస్తదన్నారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్, ఉద్యోగ సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్, నరాల సుధాకర్, ఆంజనేయులు, ప్రసాద్, రవీందర్, దేవేందర్, గంగాకిషన్, శంకర్, శ్రీలత, నారాయణరెడ్డి, సత్యప్రకాష్, భూమన్న, శ్రీనివాస్, బాలన్న పాల్గొన్నారు.

## డిఎస్‌సిలో అక్రమాలు విద్యాశాఖ సిబ్బందిపై వేటు పడేనా?




ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : ఇటీవల డిఎస్‌పి రిక్రూట్‌మెంట్‌లో జరిగిన అక్రమాలు రోజురోజుకు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. గత వారం రోజులుగా ఒకరు ఉద్యోగాన్ని తీసి మరొకరికి కట్టబెట్టిన వ్యవహారం చిలికి చిలికి గాలివానై అది కాస్త తుఫాన్‌గా మారంతో ఎవరి మెడకు ఉచ్చు బిగుస్తుందోనని భయం భయంగా ఎదురుచూస్తున్నట్లు సమాచారం. తప్పు చేసి తప్పించుకుందామనుకున్న వారికి వేటు తప్పదా ? ఇదే విషయంలో జిలాలలో చర్చనీయాంశంగా మారింది. ఉపాధ్యాయురాలు ఉట్నూరు లావణ్య కష్టపడి 257 ర్యాంకుతో బిసి ఎ కేటగిరిలో ఉద్యోగం పొంది నెల రోజులుగా పని చేస్తున్న క్రమంలో తాను చేస్తున్న ఉద్యోగం తనది కాదని మరొకరికి చెందాల్సిందంటూ లావణ్య ఉద్యోగాన్ని తొలగించి 125వ ర్యాంకు గల భార్గవి అనే మహిళకు ఉద్యోగం కట్టబెట్టడం వివాదాస్పదంగా మారింది. ఎందుకంటే బార్గవి బిసి ఎ కేటగిరికి చెందిన మహిళ అయినప్పటికీ ఆమెకు ర్యాంకు తర్వాత ర్యాంకు అయిన 257కు ఉద్యోగం రావటానికి ప్రధాన కారణం భార్గవి వెరిఫికేషన్‌కు హాజరు కాకపోవటమే నన్నది నగ్న సత్యం. కానీ వెరిఫికేషన్‌కుహాజరు కానీ భార్గవి ఉద్యోగం పొందాలని చేసిన పైరవీలో విద్యాశాఖ సిబ్బందితో ఒకరిద్దరు కాసులకు కక్కుర్తి పడి చక్రం తిప్పి వెరిఫికేషన్ హాజరు కానీ భార్గవికి ఉద్యోగం కల్పించడానికి అక్రమ ఒప్పందాలు చేసుకుని వెరిఫికేషన్కు హాజరైనట్లు పైల్ తయారుచేసి ఉద్యోగం కల్పించటానికి డైరెక్టరేట్‌కు పంపాల్సిన ప్రతిపాదనలను పంపి ఉద్యోగం ఇప్పించటంలో జిల్లా విద్యాశాఖ కీలకపాత్ర పోషించడం విమర్శలకు తావిస్తున్నారు. ఈ వ్యవహారంలో మాజీ డీఈఓ పాత్ర ఉందంటూ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే న్యాయంగా దక్కిన ఉట్నూర్ లావణ్య ఉద్యోగం తీసి వేయించటం సరైంది కాదని విద్యాశాఖలో పలువురు భావిస్తున్నారు. ఒకసారి ఉద్యోగం ఇచ్చి వెంటనే తొలగించడం ఏంటని ఇందులో ఉన్న మతలబు ఏంటని ఆరా తీస్తే అసలు విషయం బయట పడింది. ఉద్యోగం కోల్పోయి అన్యాయానికి గురైన ఉట్నూర్ లావణ్యకు కొన్ని ఉపాధ్యాయ సంఘాలు అండగా నిలిచి తిరిగి ఆమెకు ఉద్యోగం ఇప్పించాలని లావణ్యను అక్రమంగా ఉద్యోగం నుంచి తొలగించటంలో కీలకపాత్ర పోషించిన విద్యాశాఖ సిబ్బందిని గుర్తించి సస్పెండ్ చేసి విచారణ జరపటంలో జిల్లా యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు ప్రవర్తిస్తుండటం పలు అనుమానాలకు తావిస్తుంది. తక్షణ చర్యలు తీసుకోవం పక్కన పెట్టి ఈ రకమైన వేచి చూసే వైఖరిని ప్రదర్శిస్తుండటం జిల్లా యంత్రాంగానికి మచ్చగానే మిగిలిపోతుంది. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం అక్రమార్కుల పట్ల కఠినంగా వ్యవహరించి విద్యాశాఖలో జరిగిన తప్పుడు నిర్ణయానికి కారకులైన వారిని గుర్తించి సస్పెండ్ చేసి లావణ్యకు న్యాయం జరగకపోతే కొద్ది రోజుల్లోనే ఉపాధ్యాయ సంఘాలు కార్యాచరణ ప్రకటించి లావణ్య చేత తనకు జరిగిన అన్యాయంపై న్యాయం జరిగే వరకు నిరాహార దీక్షకు కలెక్టరేట్‌ను వేదికగా చేసుకుని ఉద్యమించాలని ఆలోచన చేస్తున్నట్లుగా ఉపాధ్యాయ సంఘాలు ఆలోచనలో అన్నట్లు తెలుస్తుంది. విద్యాశాఖ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో ఇక వేచి చూడాల్సిందే.

